



Truth of News

# సూర్య వాస్తవం

RNI NO : APTEL/25/A0239

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 40 | శుక్రవారం 4 జూలై 2025 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

## 21 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు

### - కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు



**న్యూఢిల్లీ- సూర్య వాస్తవం, జూలై 3:**

జులై 21 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జరగనున్నాయి. ఆగస్టు 21 వరకు నెల రోజుల పాటు సభా కార్యకలాపాలు జరగనున్నాయి. ఈ మేరకు పార్లమెంట్ సమావేశాల షెడ్యూల్‌కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలినట్లు కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ప్రకటించారు. ఆగస్టు 15న స్వాతంత్ర్య దిన వేడుకలు ఉన్నందున 13, 14 తేదీల్లో సమావేశాలు ఉండవని తెలిపారు. ఆపరేషన్ సిందూర్, పహల్గాం ఉగ్రవాద దాడిపై పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ ప్రకటన చేసింది. ఈ సమావేశాల్లోనే బీమా సవరణ బిల్లును ప్రవేశపెట్టే అవకాశముంది. బీమా రంగంలో ఎఫ్‌డీఐ పరిమితిని 100 శాతానికి పెంచుతున్నట్లు తెలుస్తోంది. బిల్లు ముసాయిదా సిద్ధంగా ఉంది. పహల్గాం

- మిగతా 2లో..

## మోడీకి ఘనా జాతీయ గౌరవ పురస్కారం

### - 'ది ఆఫీసర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది స్టార్ ఆఫ్ ఘనా' పురస్కారాన్ని అందజేసిన ఘనా అధ్యక్షుడు జాన్ ద్రామనీ మహామా



**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం, జూలై 3:** ప్రధాని నరేంద్ర మోడీకి ఘనా జాతీయ గౌరవ పురస్కారం 'ది ఆఫీసర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది స్టార్ ఆఫ్ ఘనా' లభించింది. మోడీ రాజనీతిజ్ఞత, ప్రభావవంతమైన ప్రపంచ నాయకత్వాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ పురస్కారాన్ని అందజేశామని ఘనా తెలిపింది. ఘనా అధ్యక్షుడు జాన్ ద్రామనీ మహామా బుధవారం మోడీకి ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ విషయాన్ని మోడీ సామాజిక మాధ్యమం ఎక్స్ ద్వారా తెలియజేశారు. ఈ పురస్కారం పొందడం గౌరవంగా, గర్వంగా భావిస్తున్నానని మోడీ తెలిపారు.

## రుణాల్లో కూరుకుపోతున్న రైతులు..

### - ఉదాసీనంగా మోడీ ప్రభుత్వం



**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం, జూలై 3:** రైతులు రోజురోజుకి రుణాల ఊబిలో కూరుకుపోతున్నా మోడీ ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ధ్వజమెత్తారు. మహారాష్ట్రలో జనవరి-మార్చి మధ్య 767 మంది రైతులు మరణించారన్న నివేదికపై గురువారం ఆయన మాట్లాడారు. రుణమాఫీ, పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) కోసం రైతులు డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వం విస్మరించిందని మండిపడ్డారు. రైతు మరణాలు, రాష్ట్రంలో సోయాబీన్ సాగుదారులకు బకాయిలు చెల్లించకపోవడాన్ని విమర్శిస్తూ బుధవారం ప్రతిపక్షాలు రాష్ట్ర అసెంబ్లీ నుండి రెండుసార్లు వాకౌట్ చేసిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది జనవరి - మార్చి మధ్యలో సుమారు 767మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని కాంగ్రెస్ నేత విజయ్ వాడేట్టివార్ అసెంబ్లీకి తెలిపారు. వీరిలో 200 మందిని రైతు సాయానికి అనర్హులుగా ప్రకటించారని, 194 కేసులపై విచారణ పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు.

కేవలం మూడు నెలల్లోనే రాష్ట్రంలో 737 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని,

- మిగతా 2లో..



## టాటా డిజిటల్ నెర్వ్ సెంటరును ప్రారంభించిన సీఎం

- టాటా సంస్థ సహకారంతో రాష్ట్రంలోనే తొలి నెర్వ్ సెంటర్ ఏర్పాటు
- ప్రజల ఆరోగ్య రికార్డుల డిజిటలైజేషన్, నిరంతర పర్యవేక్షణ
- ఆస్పత్రులు, పీహెచ్‌సీలు, హెల్త్ సెంటర్ల అనుసంధానం
- వర్చువల్ విధానంలోనూ వైద్య నిపుణుల సలహాలు, సూచనలు
- దశలవారీగా రాష్ట్రవ్యాప్తంగా సేవలు విస్తరించాలని ప్రభుత్వ ప్రణాళిక

**కుప్పం - సూర్య వాస్తవం, జూలై 3**

ఏపీలో ప్రజారోగ్య సంరక్షణ వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. సీఎం చంద్రబాబు తన సొంత నియోజకవర్గమైన కుప్పంలో రాష్ట్రంలోనే మొట్టమొదటి డిజిటల్ నెర్వ్ సెంటర్ ను ప్రారంభించారు. ప్రముఖ సంస్థ టాటా సహకారంతో

- మిగతా 2లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి



## పీ-4పై విమర్శలా

- మామిడి రైతులను ఆదుకుంటాం
- పల్ప్ కంపెనీల సిండికేట్ సరిచేస్తాం
- 'బనకచర్ల'తో తెలంగాణకు ఎలాంటి నష్టమూ లేదు
- మీడియా సమావేశంలో సిఎం చంద్రబాబు

మామిడి రైతులను ఆదుకుంటామని, పల్ప్ కంపెనీల సిండికేట్‌ను సరిచేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. బనకచర్ల ప్రాజెక్టు వల్ల తెలంగాణకు ఎటువంటి నష్టమూ లేదని తెలిపారు. బనకచర్లపైనా, పి-4పైనా కొందరు అనవసర రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు.

**శాంతిపురం- సూర్య వాస్తవం, జూలై 3**

కుప్పం నియోజకవర్గంలో పర్యటనలో భాగంగా రెండో రోజు శాంతిపురంలో మీడియాతో ఆయన మాట్లాడారు. ఈసారి మామిడి దిగుబడి బాగా వచ్చిందన్నారు. అంతర్జాతీయ మార్కెట్లో సమస్య ఏర్పడిందని తెలిపారు. పండించిన పంటకు విలువ జోడింపు, ఫుడ్ ప్రాసెసింగ్ చేయాల్సి ఉందన్నారు. పల్ప్ కంపెనీలు సిండికేట్ అయ్యాయని అంటున్నారని, దీన్ని సరిజేస్తామని తెలిపారు. శవ రాజకీయాలు చేసిన వారు ఇప్పుడు మామిడి రైతులపై ప్రేమ కురిపిస్తున్నారని విమర్శించారు. మామిడి రైతులకు మాపై నమ్మకం ఉందన్నారు. బనకచర్ల ప్రాజెక్టు వల్ల ఎవరికీ నష్టంలేదని తెలిపారు. తెలంగాణలో చాలా ప్రాజెక్టుకు తానే శంకుస్థాపనలు చేశానని, గోదావరిలో నీళ్లు ఎగువన ఉన్న రాష్ట్రాలు, దిగువన ఉన్న రాష్ట్రాలు వినియోగించుకోవచ్చని తెలిపారు. రెండు వేల టిఎంసిల నీరు వృథాగా సముద్రంలోకి పోతోందని, ఈ నీటిని వాడుకుంటే రెండు రాష్ట్రాలకూ ప్రయోజనం ఉంటుందని అన్నారు. గోదావరిపై తెలంగాణ కట్టిన ప్రాజెక్టులను తాను వ్యతిరేకరించలేదని తెలిపారు. కూటమి ప్రభుత్వం బాధ్యతగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. ఏడుగురు పిల్లలున్న వారికీ తల్లికి వందనం పథకం అమలు చేశామని తెలిపారు. సామాజిక పింఛన్లు 64 లక్షల మందికి ఇస్తున్నామన్నారు. ప్రజల నుంచి వస్తోన్న ఫిర్యాదుల్లో 80 శాతం భూవివాదాలకు సంబంధించినవే ఉంటున్నాయన్నారు. బ్లాక్ చెయిన్ విధానం ద్వారా భూ సమస్యలను సరిచేస్తామని తెలిపారు.

**చిల్లిగవ్వ ఇవ్వని వారు 'పి-4'ని విమర్శిస్తున్నారు**

చిల్లిగవ్వ ఇవ్వని వారు 'పి-4' విధానాన్ని విమర్శిస్తున్నారని, పేదలను ఆదుకునేందుకు మార్గదర్శకులను అన్వేషిస్తుంటే ఆరోపణలు చేస్తున్నారని చంద్రబాబు అన్నారు. ప్రభుత్వ వనరులను దోచుకోవడం తప్ప చిల్లిగవ్వ ఖర్చు పెట్టని వాళ్లు రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. గతంలో జన్మభూమికి పిలుపునిచ్చానని, ఇప్పుడు

## ఏపీలో మోడల్ ఎడ్యుకేషన్ తీసుకొస్తాం

- 'మనబడికి మహా న్యూస్' కార్యక్రమాన్ని ప్రశంసించిన మంత్రి నారా లోకేశ్
- ప్రభుత్వ పాఠశాలల్లోని సంస్కరణలను చూపించడంపై హర్షం వ్యక్తం
- సోషల్ మీడియా వేదికగా మహా న్యూస్ ఛానల్‌కు అభినందనలు
- ఛానల్ యాజమాన్యానికి, సిబ్బందికి హృదయపూర్వక కృతజ్ఞతలు



**అమరావతి- సూర్య వాస్తవం, జూలై 3**

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన సంస్కరణలు, వాటి ద్వారా వస్తున్న సానుకూల ఫలితాలపై 'మనబడికి మహా న్యూస్' పేరిట ప్రత్యేక కథనాలను ప్రసారం చేస్తున్న 'మహా న్యూస్' ఛానల్‌ను ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అభినందించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా

- మిగతా 2లో..

## కరేడు భూముల జోలికొస్తే చూస్తూ ఊరుకోం: వైఎస్ షర్మిల

- నెల్లూరు జిల్లా కరేడు రైతుల ఉద్యమానికి కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతు
- ఇండోసోల్ సోలార్ ప్లాంట్ కోసం భూసేకరణపై పీసీసీ చీఫ్ షర్మిల ఆగ్రహం
- గ్రామ సభలు లేకుండా నోటిఫికేషన్ ఇవ్వడం నియంతృత్వ పోకడ అని విమర్శ
- మూడు పంటలు పండే భూములను లాక్కోవద్దని ప్రభుత్వానికి డిమాండ్
- భూసేకరణ నోటిఫికేషన్ వెంటనే రద్దు చేయాలని షర్మిల హెచ్చరిక



**నెల్లూరు - సూర్య వాస్తవం, జూలై 3**

నెల్లూరు జిల్లా కరేడులో ఇండోసోల్ కంపెనీ సోలార్ ప్లాంట్ ఏర్పాటు కోసం ప్రభుత్వం చేపట్టిన భూసేకరణపై ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పచ్చని పొలాలను నాశనం చేసి పరిశ్రమలు పెట్టాలనుకోవడం దారుణమని, కరేడు రైతుల భూముల జోలికి వస్తే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తామని ఆమె హెచ్చరించారు. గత వైసీపీ ప్రభుత్వం ఈ కంపెనీకి అనుమతులు ఇస్తే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఏకంగా

- మిగతా 2లో..

## రుణాల్లో కూరుకుపోతున్న రైతులు..

(మొదటిపేజీ తరువాయి)

ఇవి కేవలం గణాంకాలే కాదని, ఇవి 767 కూలిపోయిన ఇళ్లని అన్నారు. ఈ 767 కుటుంబాలు ఎప్పటికీ కోలుకోలేవని, అయినా దేవేంద్ర ఫడ్నవీస్ ప్రభుత్వం మౌనంగా చూస్తోందని, ఉదాసీనంగా వ్యవహరిస్తోందని రాహుల్‌గాంధీ మండిపడ్డారు. విత్తనాలు, ఎరువులు, డీజిల్ ఖరీదైనవి కావడంతో రైతులు ప్రతిరోజూ అప్పుల్లో కూరుకుపోతున్నారని విమర్శించారు. వారికి ఎంఎస్‌పి హామీ, రుణమాఫీ లేవని ఆవేదన వ్యక్తం చేశారు. కానీ కోట్లు ఉన్న వారికి మోడీ ప్రభుత్వం సులభంగా రుణమాఫీ చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకు "అనిల్ అంబానీ రూ.48,000 కోట్ల ఎస్‌బిఐ 'మోసం' " వార్త ఉదాహరణని అన్నారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తానని ప్రధాని మోడీ హామీ ఇచ్చారని, కానీ నేడు రైతు వారి జీవితాలను సగంలోనే ముగించుకునే పరిస్థితి నెలకొందని అన్నారు. ఈ వ్యవస్థ రైతులను నిశ్శబ్దంగా, నిరంతరం చంపుతోందని, కానీ మోడీ తన సొంత ప్రయోజనాలపై దృష్టి సారించారని అన్నారు.

## 21 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు

(మొదటిపేజీ తరువాయి)

ఉగ్రదాడి, ఆ తరువాత చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించిన విషయాలపై పార్లమెంట్ ప్రత్యేక సమావేశంలో చర్చించాలని ప్రతిపక్ష పార్టీల నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే. భారత్-పాక్ మధ్య జరిగిన కాల్పుల విరమణ ఒప్పందానికి తానే మధ్యవర్తిత్వం వహించానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనపై కూడా ఈ సందర్భంగా చర్చించాలని పట్టుబట్టారు. ఈ నేపథ్యంలో వర్షాకాలపు సమావేశాలు వాడి వేడిగా జరిగే అవకాశముంది. గతలో పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు రెండు భాగాలుగా జరిగాయి. మొదటి సమావేశం జనవరి 31న ప్రారంభమై ఫిబ్రవరి 13 వరకూ కొనసాగింది. పార్లమెంటు బడ్జెట్ సమావేశాల రెండవ భాగం మార్చి 10న ప్రారంభమై ఏప్రిల్ 4న ముగిసింది.

## పీ-4పై విమర్శలా..

(మొదటిపేజీ తరువాయి)

పి-4 కార్యక్రమాన్ని చేపట్టానని అన్నారు. గతంలో తాను చేసిన సాయంతో బాగా చదువుకుని అమెరికా వెళ్లి డబ్బులు సంపాదించిన వారు ఇప్పుడు మార్గదర్శకులుగా మారుతున్నారని తెలిపారు. కుప్పం నియోజకవర్గంలోని తిమ్మరాజుపల్లి గ్రామ పేదలను పి-4 ద్వారా ఆదుకుంటామని ఓ కుటుంబం ముందుకొచ్చిందన్నారు. ఆర్థిక అసమానతలు తగ్గించి మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడమే తమ లక్ష్యమని తెలిపారు. రాబోయే రోజుల్లో అతిపెద్ద సవాలు ఆరోగ్యమేనని, కుప్పంలో టాటా భాగస్వామ్యంతో డిజి నెర్వ్ సెంటర్‌ను ప్రారంభించామన్నారు. నెలరోజుల పాటు ఇంటింటికీ టిడిపి కార్యక్రమం జరుగుతుందని, నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ఏడాది పాలన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రచారం చేస్తారని తెలిపారు. లోటుపాట్లు ఉంటే తెలుసుకుంటారన్నారు.

## టాటా డిజిటల్ నెర్వ్ సెంటరును ప్రారంభించిన సీఎం

(మొదటిపేజీ తరువాయి)

ఏర్పాటు చేసిన ఈ కేంద్రం, ప్రజల ఆరోగ్య సమాచారాన్ని డిజిటల్ రూపంలో భద్రపరిచి, వైద్య సేవలను మరింత సులభతరం చేయనుంది. ఈ డిజిటల్ నెర్వ్ సెంటర్ ద్వారా కుప్పం ఏరియా ఆస్పత్రితో పాటు 13 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీలు), 92 గ్రామ ఆరోగ్య కేంద్రాలను అనుసంధానించారు. దీనివల్ల ప్రతి వ్యక్తి ఆరోగ్య రికార్డులను డిజిటల్ రూపంలో భద్రపరచడమే కాకుండా వారి ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షించేందుకు వీలు కలుగుతుంది. సకాలంలో వ్యాధి నిర్ధారణ, స్పెషలిస్ట్ వైద్యుల అపాయింట్‌మెంట్‌లు, వ్యక్తిగత కౌన్సెలింగ్ వంటి సేవలను ఈ కేంద్రం అందిస్తుంది. అలాగే అవసరమైన సందర్భాల్లో రోగులకు వర్చువల్ విధానంలోనే వైద్య నిపుణులతో మాట్లాడించి చికిత్స అందించే సౌకర్యం కూడా ఉంది. ఎన్టీఆర్ వైద్య సేవా పథకం సేవలను, ప్రైవేటు ఆస్పత్రులను కూడా ఈ నెర్వ్ సెంటర్ ద్వారా అనుసంధానించుకునే అవకాశం కల్పించారు. స్క్రీనింగ్ టెస్టుల నుంచి చికిత్స అనంతర ఫాలో-అప్‌ల వరకు అన్ని సేవలు ఒకేచోట లభిస్తాయి. ప్రస్తుతం మొదటి దశలో కుప్పంలో ప్రారంభమైన ఈ సేవలను, రెండో దశలో చిత్తూరు జిల్లా అంతటికీ, మూడో దశలో రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలని ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది. ఈ కార్యక్రమంతో ప్రజారోగ్య వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతాయని అధికారులు భావిస్తున్నారు.

## ఏపీలో మోడల్ ఎడ్యుకేషన్ తీసుకొస్తాం

(మొదటిపేజీ తరువాయి)

తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. "ప్రభుత్వ విద్యా వ్యవస్థలో మేము చేపట్టిన సంస్కరణలు, వాటి ఫలితాలు "మనబడికి మహా న్యూస్" పేరుతో ప్రసారం చేస్తున్న మహా న్యూస్‌కు అభినందనలు. దేశంలోనే సమున్నతంగా నిలిచేలా కూటమి ప్రభుత్వం ఏపీ మోడల్ ఎడ్యుకేషన్ తీసుకొచ్చేందుకు తీవ్రంగా కృషి చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల నుంచి ఒకేసారి మహా న్యూస్ చేస్తున్న ఈ ప్రసారాలు ప్రభుత్వ విద్యా వికాసానికి ఎంతో దోహదం చేస్తాయి. తొలిసారిగా ప్రభుత్వ విద్యాలయాల్లో జరిగిన మంచి గురించి నాన్ స్టాప్ కథనాలు చేస్తున్న మహా న్యూస్ యాజమాన్యానికి, జర్నలిస్టులకు, సిబ్బందికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు" అంటూ ట్వీట్ చేశారు.

## కరేడు భూముల జోలికొస్తే చూస్తూ ఊరుకోం: వైఎస్ షర్మిల

(మొదటిపేజీ తరువాయి)

ఊరినే ఖాళీ చేయించేలా భూములు కేటాయించాలని చూడటం అన్యాయమని పేర్కొన్నారు. ఈ మేరకు కరేడు రైతులు చేస్తున్న పోరాటానికి కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. "కరేడు రైతులది బతుకు పోరాటం. ఊరిని చంపి పరిశ్రమ పెడతాం అంటే చూస్తూ ఊరుకునేది లేదు. కరేడు భూములు జోలికొస్తే రైతుల పక్షాన ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తాం. పచ్చటి పొలాల్లో ప్రజా అభిప్రాయం సేకరించకుండా భూ సేకరణకు నోటిఫికేషన్ ఇవ్వడం దుర్మార్గం. ఇది కూటమి ప్రభుత్వ నియంత పోకడకు నిదర్శనం. ప్రజల నిర్ణయానికి వ్యతిరేకంగా ఇండోసోల్ సోలార్ కంపెనీకి 8,458 ఎకరాలు దారాదత్తం చేస్తామనడం ద్రోహం. గత వైసీపీ ప్రభుత్వం షిరిడీ సాయి అనుబంధ కంపెనీకి అనుమతులు ఇస్తే, ఇప్పుడు కూటమి ప్రభుత్వం భూ సేకరణకు కనీసం గ్రామ సభలు పెట్టలేదు. మూడు పంటలు పండే పచ్చటి పొలాల్లో పరిశ్రమ వద్దంటున్న రైతుల గోడు వినలేదు. ఇండోసోల్ కంపెనీకి అదనంగా భూములు కేటాయించి, ఊరినే ఖాళీ చేయించాలని చూస్తున్నారు. శాంతియుత ఉద్యమం చేసే కరేడు గ్రామ ప్రజలను నిర్బంధించడాన్ని, అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నాం. కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నాం. వెంటనే భూసేకరణకు ఇచ్చిన నోటిఫిషన్ ను రద్దు చేయండి. సోలార్ ప్లాంట్ ఏర్పాటుపై కరేడు గ్రామ ప్రజల అభిప్రాయాన్ని తీసుకోండి. గ్రామ సభలు నిర్వహించండి. రైతుల డిమాండ్లపై సానుకూలంగా స్పందించండి. పరిశ్రమల ఏర్పాటుకు కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకం కాదు... అలా అని రైతుల శవాల మీద అక్రమంగా భూసేకరణ చేయాలని చూస్తే మాత్రం సహించేది లేదు" అంటూ ఏపీ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

# రెడ్ బుక్ లో నెక్స్ట్ ఎవరు...?

**తిరుపతి- సూర్య వాస్తవం:**

ఎట్టకేలకు వల్లభనేని వంశీకి బెయిల్ దొరికింది ...140 రోజుల జైలు జీవితానికి మోక్షం లభించింది ...అయితే ఇప్పుడే వంశీని జైలు జీవితం విడిపోతుందా! లేక ఇంకేమైనా ఈ కథలో టెస్టులు ఉంటాయా? అన్న ప్రశ్నలు ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో ఉన్నాయి. అయితే అనవసరంగా నోరు పారేసుకుని, రెడ్ బుక్ బాధితులుగా మారిన అనేక మంది ,ఇప్పటికే కారాగారంలో ఊసలు లెక్కపెట్టి వచ్చారు.... అందులో సినిమా రంగానికి చెందినవారు, పత్రికారంగానికి చెందినవారు, రాజకీయ రంగానికి చెందినవారు అన్న తేడా లేకుండా, ఎవరీ లెక్కలు వాళ్ళకి అప్పజెప్తుంది రెడ్బుక్ ....అయితే అందరికన్నా అగ్ర తాంబూలం ఈ రెడ్ బుక్కులో ఎవరికి అందబోతుంది ....ఇప్పటికీ రేట్ బుక్ లో మొదటి పేజీ మాత్రమే చూస్తున్నారని చెబుతున్న టిడిపి కార్యకర్తల మాటల్లో ఆంతర్యం ఏంటి ? రెడ్ బుక్ లో తదుపరి పేజీల్లో ఎవరెవరి పేర్లు పొందుపరిచి ఉన్నాయి. నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుంది ...అనే సామెత ఉంది ....పెద్దవాళ్లు ఊరికే అనలేదా మాట ...ఎక్కడైతే అనవసరంగా నోరు పారేసుకుంటామమో ,అక్కడ మన ఉనికికే ప్రమాదం ఏర్పడుతుంది... అని పెద్దలు ముందే గమనించబట్టి ఈ సామెతలు కనిపెట్టి ఉంటారు.... అయితే ఇటీవల రాజకీయాల్లో ఈ మాటను ఎవరు వినడం లేదు సరి కదా, పెడ చెవిన పెడుతున్నారు ... దీంతో వాళ్లు వీళ్ళు అని తేడా లేకుండా, ప్రతి ఒక్కరు సమస్యల్లో ఇరుకుంటున్నారు .. అలాంటి బాపతే గడిచిన కొన్నాళు ‿గా తెలుగు రాష్ట్రాల్లో జైలలో కాలక్షేపం చేస్తున్న నాయకులు... మాజీ ఎంపీ నందిగం సురేష్, సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాస్, సినీ నటుడు పోసాని కృష్ణమురళి, బోరుగడ్డ అనిల్ కుమార్, ఇప్పుడు తాజాగా 140 రోజులు జైలు జీవితానికి బెయిల్ తీసుకున్న వల్లభనేని వంశీ,,, వీరంతా వేరే వేరే కేసుల్లో జైలు జీవితం అనుభవించిన దీనంతటి సారాంశం అధికారంలో ఉన్నప్పుడు నోరు పారేసుకున్నారు అన్న విషయం తెలుగు రాష్ట్రాల్లోని ప్రజలకు తెలియంది కాదు.... అయితే ఇప్పటికీ వల్లభనేని వంశీ జైలు జీవితం కథకు ఫుల్ స్టాప్ పడినట్లేనా లేక ఇతర వ్యవహారాల్లో మళ్ళీ శ్రీకృష్ణ జన్మస్థానం వల్లభనేని వంశీని వెంటాడుతుందా అన్న ప్రశ్న కూడా ఉంది.ఒక్క వల్లభనేని వంశీ నే కాదు,... ఎవరైతే గతంలో నోరు పారేసుకున్నారు వాళ్ళందరికీ శ్రీకృష్ణ జన్మస్థానం రుచి చూపించాలని ప్రయత్నం అయితే గట్టిగానే జరుగుతుంది ....అలాంటప్పుడు ఒళ్ళు ,నోళ్ళు దగ్గర పెట్టుకొని మసులుకోవాలన్న హెచ్చరికలు కూడా వినపడుతున్నాయి... ఈ హెచ్చరికలు విషయం పక్కనపెడితే, ఇప్పుడు రెడ్ బుక్ లోని మొదటి పేజీ



నడుస్తుంది ....ఈ రెడ్బుక్ లోని మొదటి పేజీలో ఇంకెన్ని పేర్లు ఉన్నాయి? చివరి పేజీకి వచ్చేసరికి ఎంతమంది నాయకులు జైల్లో మగ్గాల్సి వస్తుంది అన్న చర్చ కూడా జరుగుతుంది ....ఇక తాజాగా వినిపిస్తున్న పేర్లు టిడిపి వర్గాల్లో ఆసక్తి రేకెత్తిస్తుంది... టిడిపి సోషల్ మీడియాలో కొందరి వైసీపీ నాయకుల పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి....సీదిరి అప్పలరాజు నుండి ,కొడాలి నాని వరకు ఆ లిస్టులో పేర్లు సోషల్ మీడియాలో హల్చల్ చేస్తున్నాయి. అందులో ప్రముఖంగా వినిపిస్తున్న పేర్లు, సీదిరి అప్పలరాజు , రాంగోపాల్ వర్మ ,శ్రీరెడ్డి మాజీ మంత్రులు,పేర్ని నాని , జోగి రమేష్, అంబటి రాంబాబు విడదల రజిని , మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ లాంటి వారి పేర్లు రెడ్ బుక్ లో ప్రముఖంగా ఉన్నట్లు చర్చ జరుగుతుంది....

అయితే ఇందులో ఇప్పటికే కొంతమందికి,కొన్ని కేసులలో నోటీసులు వచ్చిన, తమకున్న టాలెంట్ ఉపయోగించి కోర్టులకు వెళ్లి కొంత ఉపశమనం పొందారు ...అయితే రాబోయే రోజుల్లో వీళ్ళందరికీ మరోసారి రెడ్బుక్ వ్యవహారాన్ని పరిచయం చేపించాలని టిడిపి శ్రేణులు ఉవ్విల్లు ఊరుతున్నట్లు తెలుస్తోంది.. . చంద్రబాబుకు మైండ్ పోయిందని ట్రీట్మెంట్ చేయించాలని, వయసును కూడా గౌరవించకుండా ఇష్టరాజ్యంగా మాట్లాడిన మాజీ మంత్రి అప్పలరాజు, ఇప్పుడు రెడ్ బుక్ లోని మరో పేజీలో ఉన్నట్లు చర్చ జరుగుతుంది అంతేకాదు వల్లభనేని వంశీకి ఆత్మీయ మిత్రుడు, టిడిపికి గతంలో కొరకరాని కొయ్యగా మారి ఇప్పుడు చడిచప్పుడు లేకుండా అనారోగ్య సమస్యలతో హైదరాబాదులో మకం వేసి ఉంటున్న కొడాలి నాని కి , రెడ్ బుక్కు లో ప్రముఖ పేజీ ఉన్నట్లుగా చర్చ జరుగుతుంది .... దీంతోపాటు టిడిపిపై తీవ్ర పదజాలంతో వ్యాఖ్యలు తో పాటు ఇటీవల పోలీసులపై కూడా దూకుడు ప్రదర్శించిన, మాజీ మంత్రి అంబటి రాంబాబు, జగన్ పర్యటనలో ఇద్దరు వ్యక్తుల మరణాలకు కారణమైన నాయకులకు త్వరలోనే కేసుల చిట్టా పరిచయం కాబోతుందని ప్రచారం జరుగుతుందిమరి రాబోయే రోజుల్లో కారాగారంలో కాలక్షేపం చేసే నాయకులు వీళ్లేనా? టిడిపి క్యాడర్ చేసుకుంటున్న,చర్చలో నిజం ఎంతో అబద్ధం ఎంతో టిడిపి నేతలకే తెలియాలి ....అయితే టిడిపి కార్యకర్తలు మాత్రం చేసిన తప్పుకే వాళ్ళు శిక్ష అనుభవిస్తున్నారు కానీ, టిడిపి వ్యక్తిగతంగా ఎవరిని టార్గెట్ చేయలేదనేది చెబుతున్న మాట .... సరే ఎవరి మాట ఎలా ఉన్నా జరుగుతున్న పరిణామాలు పరిశీలిస్తే, ఒక పద్ధతి ప్రకారం రెడ్ బుక్ లో పేజీల్లో ఉన్న నాయకులకు ట్రీట్మెంట్ జరుగుతుందనేది వాస్తవం. మరి ఈ తదుపరి పేజీల్లో ఉండే తదుపరి నాయకులు ఎవరో కాలమే నిర్ణయించాలి

## రోగుల నుండి ఆసుపత్రుల యాజమాన్యం ఎటువంటి నగదు తీసుకోరాదు

### - ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ ప్రోటోకాల్‌ను ట్రస్టుతో ఎంప్యానల్ అయిన ఆసుపత్రులన్నీ పక్కాగా పాటించాలి - జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి



**రాయచోటి - సూర్య వాస్తవం, జూలై 03:** ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ కార్డు ఉన్న రోగుల దగ్గర నుండి ఆసుపత్రుల యాజమాన్యం వారు ఎటువంటి నగదు తీసుకోరాదని, ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ ప్రోటోకాల్ ను ట్రస్టుతో ఎంప్యానల్ అయిన ఆసుపత్రులన్నీ పక్కాగా పాటించాలని, జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి అన్నారు. గురువారం రాయచోటి కలెక్టరేట్ లోని జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధ్యక్షతన ఆరోగ్యశ్రీ క్రమశిక్షణ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు.

ఆరోగ్యశ్రీ సమన్వయకర్త లోకవర్ధన్ సమావేశాన్ని ప్రారంభించి జిల్లాలోని వివిధ ఆసుపత్రుల యాజమాన్యం వారి పైన వచ్చిన ఫిర్యాదుల ను జిల్లా కలెక్టర్ కు వివరించారు. ఆరోగ్యశ్రీ కార్డు ఉన్నవారి దగ్గర నుండి అమరావతి హాస్పిటల్స్ యాజమాన్యం వారు 2500 రూపాయలు తీసుకున్నారని, బాలాజీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ వారు 16 వేల రూపాయలు, దేశాయ్ హాస్పిటల్స్ తీసుకున్న నగదు తదితర అంశాలను జిల్లా కలెక్టర్ కు వివరించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టుతో ఏంప్యానల్ అయిన ఆసుపత్రులన్నీ ఎన్టీఆర్ వైద్య సేవ పథకాన్ని పక్కాగా అమలు చేయాల న్నారు. ఈపథకంలోఆసుపత్రుల యాజమాన్యం రక్త పరీక్ష, సిటీ స్కాన్, తదితర సేవలకు ఎటువంటి నగదును తీసుకోరాదన్నారు. కీళ్ల సమస్యల గురించి వచ్చే వారిని తప్పుదారి పట్టించరాదన్నారు. రోగులను మానవతా దృక్పథంతో చూడాలని, వారికి కనీస అవసరాలు అయిన నీరు, తదితర సదుపాయాలను అందివాలన్నారు. ఆసుపత్రులలో ఉన్న కియోస్క్ లనునూతనీకరించుకోవాల న్నారు. ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ వారు రూపొందించిన ప్రోటోకాల్ ప్రకారం డిశ్చార్జ్ అయిన వారికి ఇవ్వవలసిన సేవలను ఇవ్వాలన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవ పథకంలో జిల్లాలోని వివిధ రోగుల దగ్గర నుండి అందిన ఫిర్యాదులపై సమీక్షిస్తూ ఆసుపత్రుల యాజమాన్యం వారు తీసుకున్న నగదును తిరిగి రోగులకు ఇచ్చేశారా లేదా అని అడగగా ఆసుపత్రుల యాజమాన్యం వారు ఇచ్చేసామని సమాధానం ఇచ్చారు. అనంతరం ఆసుపత్రుల యాజమాన్యం వారు తీసుకున్న నగదులో 50% జరిమానా వేస్తూ ఆదేశాలు జారీచేశారు.

ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డిఆర్ఓ మధుసూదన్ రావు,జిల్లా ఆరోగ్యశ్రీ సమన్వయకర్త లోకవర్ధన్, జిల్లాలోని వివిధ ఆసుపత్రుల నిర్వాహకులు, ఫిర్యాదుదారులు, తదితరులు పాల్గొన్నారు.



## సంపాదకీయం

# నక్సల్స్ రహిత భారతం సాధ్యమేనా



రానున్న 2026 మార్చి ఆఖరినాటికి దేశంలో మావోయిస్టుల ఉనికి అనేది లేకుండా చేయటమే కేంద్ర ప్రభు త్వం లక్ష్యంగా నిర్ణయించినట్లు కేంద్ర హోం శాఖా మంత్రి అమిత్ షా తెగేసి మరీ చెప్పటం పరిశీలిస్తే ఆ నిర్ణయం తిరుగు లేనట్లు తేలిపోయిందని చెప్పక తప్పదు. ఈ మేరకు వర్షాకాలంలోనూ నక్సల్ అణచివేత కూంబింగ్ చర్యలు కొనసాగుతాయని ఇటీవల ఛత్తీస్‌గడ్‌లో పర్యటించిన మంత్రి అమిత్ షా పేర్కొన్నారు కూడా కేంద్ర ప్రభుత్వం నక్సల్స్ ఉనికిని పూర్తి గా నిర్మూలించి వచ్చే 2026 మార్చి నాటి కి భారత్‌దేశాన్ని నక్సల్ రహిత భారత్‌గా తీర్చిదిద్దేందుకు ఆపరేషన్ కగార్‌ని ఆఖరి పోరాటంగా రంగంలోకి దించింది. అన్ని విధాల ఆయుధాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, డ్రోన్లు, హెలికాప్టర్లు భారీగా సరఫరా చేసి భారీ సంఖ్యలో వివిధ రక్షణ బలగాలకు చెందిన ఆరితేరిన బృందాలను కేటాయించారు.మావోయిస్ట్ ప్రభావిత ప్రాంతాలైన తెలంగాణ, ఛత్తీస్‌గడ్, జార్ఖండ్, మహారాష్ట్ర రాష్ట్రాల్లోని అరణ్యప్రాంతాల్లోని గుట్టలపైన దాడులు, సర్చ్ ఆపరేషన్‌లు ముమ్మరం చేయటంతో మావోయిస్టులు గుక్క తిప్పుకోలేక పోతున్నట్లు సమాచారం.


ఇప్పటికే కొందరు లొంగి పోతామని వస్తున్న వార్తలు కూడా విదితమే.ఈ ఏరివేతలో భాగంగా ఈనెల 26న ఉదయం ఛత్తీస్‌గఢ్‌లో నారాయణ్‌పూర్ జిల్లాలో భ ద్రతా సిబ్బందితో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మహిళా నక్సలైట్లు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మావోయిస్టు ల మాడ్ డివిజన్‌కు చెందిన పెద్ద క్యాడర్ ఉనికి గురించి పోలీసులకు సమాచారం అందడంతో అభుజ్మాద్ ప్రాంతంలో ఈ ఆపరేషన్ నిర్వహించినట్లు బస్తర్ రేంజి ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ పి.సుందర్‌రాజ్ వెల్లడించటం పరిశీలిస్తే నక్సల్ అణచివేతపై కేంద్ర ప్రభుత్వ కఠిన వైఖరి అర్థమవుతున్నది.మావోయిస్ట్ ప్రభావిత ప్రాంతాల్లో వారిని ఏరి వేసేందుకు జనవరి 2024 నుంచి కేంద్ర హోం మంత్రిత్వశాఖ ప్రారంభించిన ఆపరేషన్ కగార్ (ఆపరేషన్ బ్లాక్ ఫారెస్ట్)తో ఛత్తీస్‌గడ్ రాష్ట్రంలోను, ఏఓబీలతోపాటు ఇతర ప్రాంతాల్లో జరిగిన వేర్వేరు ఎన్‌కౌంటర్లలో భద్రతా దళాలు 400 మందికి పైగా మావోయిస్టులను కాల్చి చంపాయి. ఈ ఆపరేషన్‌లో కేంద్ర సీఆర్‌పీఎఫ్, సైన్యం, కోబ్రా బెటాలియన్‌తోసహా పలు భద్రతా దళాలు పాల్గొన్నారు. ఇందులో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి వారి రహస్య ప్రదేశాలు, ఆయుధాలు, ఇతర ఆయుధాల సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. గత మే 21న జరిగిన ఎన్‌కౌంటర్‌లో నారాయణపూర్ జిల్లాలో సీపీఐ(మావోయిస్ట్) ప్రధాన కార్యదర్శి నంబాల కేశవ్ రావు అలియాస్ బసవరాజు మరణించిన వారిలో వున్నారు. నక్సలైట్ అనే పదం పశ్చిమ బెంగాల్‌లోని నక్సల్బరి గ్రామం పే రు నుంచి ఉద్భవించింది. 1967లో ఆ గ్రామంలో రైతుల తిరుగుబాటు జరిగిం ది. ఈ ఉద్యమాన్నే 'నక్సలిజం' అన్నారు.అదే సంవత్సరం 1967లో, చారుమజుందార్, కానుసన్యాల్, జంగల్ సంతల్ నేతృ త్వంలోని కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్) వర్గం సిలిగురి గ్రూప్ అనే పేరుతో, చైనా కమ్యూనిస్ట్ విప్లవం మాదిరిగానే భారతదేశంలోనూ దీర్ఘకాలిక ప్ర జాయుద్ధాన్ని కొనసాగించాలని ఆ మేరకు మజుందార్ చారిత్రక 8 పత్రాలను రాసుకున్నారు. ఇదే నక్సలైట్ ఉద్యమానికి పునా దిగా మారింది.నవంబర్ 1967లో, సుశితల్ రే చౌదరి నేతృత్వంలోని ఒక బృం దం ఆల్ ఇండియా కోఆర్డినేషన్ కమిటీ ఆఫ్ కమ్యూనిస్ట్ రివల్యూషనరీస్‌ను నిర్వహించింది. మావో జెడాంగ్ ఈ ఉద్యమా నికి సైద్ధాంతిక ప్రేరణను అందించాడు. భారతీయ రైతులు, దిగువ తరగతి గిరిజనులతో కలిసి బలవంతంగా ఉన్నత వర్గా ల ప్రభుత్వాన్ని పడగొట్టాలని ఆయన వా దించారు. మజుందార్ రచనలద్వారా వ్యాపించిన ఈ భావజాలం పట్ల చాలామంది పట్టణ ప్రముఖులూ ఆకర్షితులయ్యారు. ఈ రచనలు మావో, కార్ల్ మార్క్స్, వ్లాదిమిర్ లెనిన్ వంటి కమ్యూనిస్ట్ నాయకులు, సిద్ధాంతకర్తల అభిప్రాయాల నుంచి రాయబడ్డాయి. ఉద్యమం ప్రారంభ సంవత్సరాల్లో, ఒక ఉద్యమకారుడి నియామకం ముఖ్య లక్షణాలు నిస్వార్థత, స్వీయ త్యాగం చేసే సామర్థ్యం అని చారు మజుందార్ నమ్మాడు. అటువంటి నిర్దిష్ట వ్యక్తిత్వాన్ని ఉత్పత్తి చేయడానికి, సంస్థ విద్యార్థులు, యువతను అధికంగా నియమించుకుంది.ఈ కొత్త తిరుగుబాటుదారులలో విధేయత, విప్లవాత్మక వ్యక్తిత్వాన్ని పెంపొందించడంతోపాటు నక్సలైట్లు ఇతర కారణాల వల్ల కూడా యువతను ఎంచుకున్నారు. వీ రు ఎక్కువగా విద్యార్థులు, విద్యావంతులైన యువతను చేర్చడం అవసరం. ఎం దుకంటే వారు మావో జెడాంగ్ కమ్యూనిస్ట్ బోధనలను వ్యాప్తి చేయడంలో పా ల్గొంటారు. వారి స్థావరాన్ని విస్తరించడానికి, ఉద్యమం ఈ విద్యార్థులపై ఆధా రప డింది.కమ్యూనిస్ట్ తత్వాన్ని చదువురాని గ్రామీణ, శ్రామిక- వర్గాలకు కూడా వ్యాప్తి చేయడానికి దీనిని ఉద్దేశించారు. రైతులు, శ్రామిక వర్గాలతో తమను తాము ఏకీకృతం చేసుకోగల యువతను నియమించుకోవడం అవసరమని, ఈ దిగువ తరగతి వర్గాల మాదిరిగానే జీవించడం, పనిచేయడం ద్వారా ఈ నియామకాలు గ్రామాలకు, పట్టణ కేంద్రాలకు కమ్యూనిస్ట్ బోధనలను తీసుకెళ్లగలవని మజుందార్ విశ్వసించాడు.

క్రాంతికారి ఆదివాసీ మహిళా సంఘటన్ అనేది 1986లో పార్టీ లోపల, పార్టీ రక్షించడానికి లక్ష్యంగా పెట్టుకున్న గిరిజన గ్రామాలలో మహిళలపై తీవ్ర అసమానతను అంగీకరించిన ఫలితంగా ఏర్పడిన అనుబంధ స్త్రీవాద సంస్థ. వారు రైతుల హక్కులతో పాటు బలవంతపు వివాహం, ద్విభార్యత్వం, హింస అనే గిరిజన సంప్రదాయానికి వ్యతిరేకంగా ప్రచారం చేశారు.అయితే, 2004లో అధికారంలోకి వచ్చిన వైఎస్ రాజశేఖరరెడ్డి, అప్పటి హోం మంత్రి జానారెడ్డి ద్వారా మావోయిస్టులను శాంతిచర్చలకు ఆహ్వానించగా, అంగీకరించిన కొన్ని గ్రూపులు హైదరాబాద్‌లోనే మంజీరా అతిథి గృహంలో బసచేసి ప్రభుత్వంతో సుమారు మూడుఊ నాలుగు రో జులు చర్చలు జరిపారు. అదే మావోయిస్టులు చేసిన చారిత్రిక తప్పిదమని అంటా రు కొందరు పరిశీలకులు. ఆ సమయం లో వారిని కలిసేందుకు వచ్చిన బంధువు లు, సానుభూతిపరుల వివరాలను ప్రభు త్వం సేకరించి అణచి వేసిందని అంటారు. 2011లో చైనా ప్రభుత్వం ఉద్యమ నాయకులకు ఆశ్రయం కల్పిస్తోందని ఆరోపణలు ఉన్నాయి. పాకిస్థాన్ ఐఎస్ఐ కూ డా ఆర్థిక సహాయం అందిస్తోందని భార త పోలీసులు ప్రకటించారు. సింగపూర్‌లోని నేషనల్ యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేసిన నిపుణి గుప్త తన పరిశోధన ప్రకారం మావోయిస్టులు తమ ఆయుధాలను వివిధ మార్గాల ద్వారా పొందుతారని, వారు విముక్తి పొందిన మండలాలు, ఛత్తీస్‌గఢ్, ఒరిస్సా వంటి అడవుల ప్రాంతాల నుంచి పన్ను వసూలు ద్వారా తమ నిధులను పొందుతారని తెలుస్తుంది.స్థానిక రాజకీయ నాయకులు కూడా నక్సల్స్‌కు లెవీలు చెల్లిస్తారని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నారు.

కొండ ప్రాంతాల కారణంగా, సరిహద్దులు తక్కువగా ఉండటం వల్ల భారతదేశానికి నేపాల్ (బహుశా అక్కడి ఎంసీసీ ప్రభుత్వం కారణంగా), బంగ్లాదేశ్, మయన్మార్ నుంచి తెచ్చిన ఆయుధాలతోపాటు నక్సల్స్ వద్ద ఉన్న ఆయుధాలలో ఎక్కువ భాగం ప్రభుత్వ ఆయుధ శాలల నుంచి, భద్రతా దళాల నుండి దోచుకోబడుతున్నవే అని పరిశీలకుల అంచనా కొంతకాలంగా, నక్సల్స్ సాంకేతిక పరిజ్ఞానం పెంచుకుని తమ సొంత ఆయుధ తయారీ కర్మాగారాలను నెలకొల్పి ఆయుధాలు తయారు చేయడం ప్రారంభించారన్న సమాచారమూ ప్రభుత్వం వద్ద వుంది. ఏది ఏమైనా 2026 మార్చి ఆఖరినాటికి దేశంలో మావోయిస్ట్ ఉనికే ఉండకుండా చేసి, నక్సల్ రహిత భారత్‌గా మార్పు చేసేందుకు తమ సంపూర్ణ సామర్థ్యం కలిగిన భద్రతాదళాలు ఆఖరికి వర్షాకాలంలోకూడా సెర్చ్ ఆపరేషన్ నిలపకుండా తుడిచి పెట్టేస్తాయని కేంద్ర హోం శాఖామంత్రి అమిత్ షా పదేపదే ప్రకటించటం గమనార్హం. కేంద్ర ఉక్కు పాదం నుంచి ఇక, వారు తప్పించు కోలేరన్నది తేటతెల్లమవుతోంది.

## అన్నదాత సుఖీభవ

# అందేదెప్పుడు ....?



**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం:**

ఆంధ్రాలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి బూటకపు హామీలు ఎన్నో ఇచ్చింది. మీకు పదిహేను వేలు, మీకు... మీకు అన్నారు. చివరికి వచ్చే సంవత్సరానికి రూట్ మ్యాప్ వేస్తున్నామని దాటవేశారు. విద్యుత్ చార్జీలు పెంచమని చెప్పి పదిహేను వేల కోట్ల భారం వేశారు. రైతులకు మీరిచ్చే బోడి 13,500 ఏంటి, మేము అన్నదాత సుఖీభవ పేరుతో ఇరవై వేలు ఇస్తామన్నారు సంవ త్సరం అయినా నయాపైసా విడుదల చేయలేదు. హామీలు ఇచ్చేది పార్టీలే. కానీ ప్రభుత్వం ఏర్పడ్డాక హామీలను తుంగలో తొక్కుతున్నారు. అదేమంటే ఖజానాలో డబ్బు లేదు అంటారు. డబ్బు లేనప్పుడు హామీలు ఎందుకివ్వాలి? ఎందుకు జనాన్ని మోసం చెయ్యాలి అనే ప్రశ్నలు రావడం సహజం. జూన్ 12 వ తారీఖు ఇస్తామన్న ప్రభుత్వం మాట మార్చి జూలై 20న అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేయడానికి సిద్ధమవుతోంది. ఈ పథకానికి కేంద్ర ప్రభుత్వ పథకమైన పీఎం కిసాన్‌తో లింక్ ఉంది, అందువల్ల పీఎం కిసాన్ డబ్బులు జూలై 20న అకౌంట్లో జమ అవుతాయి అని రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం వచ్చింది. అందువల్ల తాము కూడా అదే తేదీ అకౌంట్లో జమ చేస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఏపీలో మొత్తం 45 లక్షల 71 వేల మంది రైతులను అన్నదాత సుఖీభవ పథకం పొందేందుకు అర్హులుగా రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. ఏపీలో పీఎం కిసాన్ పొందుతున్న రైతుల సంఖ్య 42 లక్షల 36 వేల 903 మాత్రమే. రాష్ట్ర ప్రభుత్వం అదనంగా 3,34,097 మందికి కూడా అన్నదాత సుఖీభవ కింద డబ్బు ఇవ్వబోతోంది.


అడవి భూముల పట్టాలు పొందిన రైతులు కూడా ఈ పథకం వర్తిస్తుంది. కేంద్రం జూన్, అక్టోబర్, ఫిబ్రవరిలో రూ.2వేల చొప్పున సంవత్సరానికి మొత్తం రూ.6000 ఇస్తుంది. అలాగే.. రాష్ట్ర ప్రభుత్వం 3 విడతలుగా ఇస్తుంది. జూన్ 20న రూ.5,000 జమ చేస్తుంది అక్టోబర్‌లో మరో రూ.5,000 ఇంకా ఫిబ్రవరిలో మరో రూ.4,000 జమ చేస్తుంది. వ్యవసాయ బోర్లకు మీటర్లు బిగించి రైతుల మెడకు ఉరి బిగిస్తున్నారు. మరోవైపు గతంలో ఉపసంహ రించుకున్న నల్ల చట్టాలు ఇప్పుడు రూపాంతరం చెంది పేరు మార్చి ప్రవేశపెడుతు న్నారు. రైతులకు పెట్టుబడి సాయం, రైతు సేవ కేంద్రాల ద్వారా ద్వారా విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు, రసాయనాలు మరియు రైతులకు పనిముట్లు, వ్యవసాయ ఉపకరణాలు తక్కువ ధరలకు అందించే విధంగా రూపకల్పన చేసాము అని గొప్పలు చెప్పుకునే ప్రభుత్వం అవి సక్రమంగా నిర్వహించక అభాసుపాలైంది. రైతులకు చేరువలో ప్రభుత్వాలని ప్రగల్భాలు తప్ప ఆచరణలో శూన్యం. పెట్టుబడి సహాయం ప్రతి రైతుకు ఇరవై వేలు ఇస్తామన్న ప్రభుత్వం మాట మరిచారు. ఫల సంప్రదాయం రైతులకు కత్తెర, కట్టర్, వ్యవసాయ పనిముట్లు ఇవ్వాల్సిన హార్టికల్చర్ డిపార్ట్మెంట్ అధికారుల జాడే లేదు. మూడు సంవత్సరాల క్రితం ఇంకుడు గుంతలు, పేర్కులేషన్ ట్యాన్క్, కట్ట కాలువలు, ఇంజెక్షన్ వెల్స్ , వ్యవసాయ పనులకు ఇవ్వాల్సిన డబ్బులు ఇంతవరకు ఇవ్వలేదు. నాబార్డ్ ఎవరి ప్రయోజనాల కోసం పనిచేస్తుందో అర్థం కాదు. సోలార్ కోల్డ్ స్టోరేజ్ లు ఎగవేత దారులకు, కార్పొరేట్ వ్యవసాయం చేసే మోతు బారి రైతులకు అప్పజెప్పారు. నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ ద్వారా పశు పోషణ, పొట్టేళ్ల పెంపకం, గేదెలు, ఆవులు పాడి పరిశ్రమకు ఏ రోజైన దరఖాస్తు చేసుకోవచ్చు, జిల్లాకు 20 కోట్లు ఇస్తే అది కేవలం ఎంపీ ఎంఎల్ఏ లకు రాజకీయ నాయకులకు వరంగా మారింది. నిజమైన రైతు లకు అన్ని ప్రతికూలతలు. రైతు డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్టు ఇవ్వాలి, మూడు సంవత్సరాలు ఐటీ రిటర్న్ ఇవ్వాలి, బ్యాంకు అధికారులతో లీడ్ బ్యాంక్ మేనేజర్ తో సఖ్యత ఉండాలి. ప్రాజెక్ట్ ఇంప్లిమెంటేషన్ ఆఫీసర్ ద్వారా కొలాటరల్ సెక్యూరిటీ ఉండి పైరవీలు చేయించుకుంటే వచ్చేది గగనం. పాలీ హౌస్, వేర్ హౌస్, మాడ్యులర్ సోలార్ స్టోరేజ్ యూనిట్ల నిర్మాణానికి ఇంతవరకు శాంక్షన్ కాలేదు. భారత దేశ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ తో కూడిన రంగాలు దేశం యొక్క జీడీపీలో దాదాపు సగానికి దోహదం చేస్తాయి, భౌతిక డిజిటల్ అవస్థాపనకు ప్రభుత్వ ప్రైవేట్ రంగ మెరుగుదలలు మద్దతుతో స్థిరంగా వృద్ధి చెందుతోందని ప్రభుత్వం భావిస్తు న్నది. వ్యవసాయ ఆర్థిక వ్యవస్థ భారీ అంతరాయం అంచున ఉంది. విలువ గొలుసు అంతా అసమర్థతను పరిష్కరించే కంపెనీలు వృద్ధి సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. కొత్త తరాల రైతులు పగ్గాలు చేపట్టినందున, వ్యవసాయ విలువ వ్యవస్థ సాంకేతికత పెద్ద పాత్ర పోషిస్తుంది. ఈ రంగానికి ఫైనా న్సింగ్‌కు వేగవంతమైన మెరుగైన యాక్సెస్ కూడా అవసరం. వినూత్న వ్యాపార నమూనా సాంకేతికత స్వీకరణ మైక్రో ఫైనాన్స్, అగ్రి వినియోగదారు రుణాలకు యాక్సెస్‌ను పెంచుతోంది. వ్యవసాయరంగం పరిపక్వం చెందుతుంది కొద్దీ కొత్త సవాళ్లు అభివృద్ధి చెందుతాయి. రైతు సమూహాలు ముఖ్యంగా పంటకోత తర్వాత సేవల కోసం సామర్థ్యం, స్థిరత్వం పెంపొందించుకోవాలి. పారదర్శకమైన నమ్మదగిన డేటా, ఫైనాన్సింగ్ కొత్త పద్ధతులను అవలంబించడం కోసం రైతులతో నమ్మకాన్ని పెంపొందించడం భారతదేశ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ యొక్క భవిష్యత్తును కూడా ప్రభావితం చేస్తుంది. గ్రామాలు మరియు గ్రామస్తులు అధిక పరిజ్ఞానం కలిగి ఉన్నారని ఎప్పటికప్పుడు మారుతున్న ప్రకృతికి అనుగుణంగా జీవించడంలో వారి నైపుణ్యాన్ని అర్థం చేసుకోవడం వాటిని నిజ జీవితంలో అన్వయించుకోవడం ప్రతి రైతు కర్తవ్యం. ప్రకృతితో మమేకమవుతూ సేంద్రియ వ్యవసాయాన్ని సుస్థిర అభివృద్ధి వైపు తీసుకుపోవలసిన అవసరం ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో జరిగే ఆవిష్కరణలకు ప్రేరణ నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ నుండి వచ్చింది. ఈ మధ్య కాలంలో గ్రామీణ ఆవిష్కరణలకు ప్రభుత్వం నుంచి ఏమాత్రం ప్రోత్సాహం లేదు. భూములలో సేంద్రియ కర్బనం తగ్గిపోయింది.దేశంలో 25 కోట్ల మంది రైతులకు భూసార పరీక్షలు నిర్వహించామని గర్వంగా చెప్పుకుంటున్న కేంద్ర ప్రభుత్వం రైతులకు ఏమాత్రం ఉపయోగం లేదు. అవసరమైన డి ఏ పి, యూరియా , విత్తన శుద్ధి చేసే ఫంగిసైడ్ సరఫరా రైతు భరోసా కేంద్రాల ద్వారా చేయలేదు. చిన్న సన్నకారు రైతులకు ప్రయోజనం ఉండేట్లు ప్రభుత్వ పథకాలు ఉండాలి, లేకపోతే ప్రయోజనం ఉండదు. జిల్లాలో డ్రోన్లు ఇవ్వడానికి శ్రీకారం చుట్టి అమలు పరచక పక్కన పెట్టారు. డ్రోన్ల వినియోగం రైతులకు వ్యవసాయ అధికారులకు తెలియదు. జీరో బడ్జెట్ ఫార్మింగ్, సేంద్రియ వ్యవసాయం సుస్థిర వ్యవసాయం ప్రాకృతిక వ్యవసాయం అని ప్రతి రోజు ఊకదంపుడు ప్రసంగాలు చేసే అధికారులు మరోవైపు రసాయన మందులు పిచికారి చేయడానికి డ్రోన్లను వినియోగించడం విడ్డూరంగా ఉంది. డ్రోన్ల వినియోగంపై వ్యవసాయ అధికారులకు శిక్షణ లేదు, ఇంతవరకు వీటిని చూసిన పాపాన అధికారులు చేయలేదు. బడ్జెట్ రిలీజ్ ఆర్డర్స్‌లో కానీ రాష్ట్ర బడ్జెట్ అవుట్ కమ్ లో డ్రోన్ల ప్రస్తావన లేదు. సంవత్సరాలుగా భూసార పరీక్షలు చేయలేదు. భూములు నిస్సారం చేసి రసాయన క్రిమి సంహారకాలు వినియోగం ఎక్కువయ్యింది, భూములలో సేంద్రియ కర్బనం తగ్గి భూములు ఎందుకు పనికిరాకుండా పోతున్నాయి. గతంలో మట్టి నమూనాలు సేకరించకుండా సాయిల్ హెల్త్ కార్డులు జారీ చేశారు.

2018 వరకు కేంద్ర ప్రభుత్వ గ్రిడ్ పథకం ద్వారా సాయిల్ హెల్త్ కార్డులు జారీ చేశాం తర్వాత భూసార పరీక్షలు నిర్వహించలేదని చెబుతున్న అధికారులు, కేటాయింపులు లేని ప్రభుత్వ పథకాలు కేవలం ప్రచార ఆర్భాటాలకే తప్ప నిజమైన గ్రామాభ్యుదయం కనపడుటలేదు. సత్వరమే అన్నదాత సుఖీభవ విడుదల చేసి రైతులకు ఉపశమనం కలిగించాలని గౌతమ్ బుద్ధ అభివృద్ధి సమాఖ్య అధ్యక్షులు డా.ముచ్చుకోట సురేష్ బాబు, కార్యదర్శి శ్రీ బాయినేని నాగేంద్ర ప్రసాద్ తదితరులు కోరారు.

# కర్ణాటకను భయపెడుతున్న హార్ట్ ఎటాక్

**బెంగళూరు - సూర్య వాస్తవం**

కర్ణాటకలో గుండెపోటు మరణాలు కలకలం రేపుతున్నాయి. ముఖ్యంగా యువత గుండెపోటుతో మృతి చెందడం ఆందోళన కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో సీఎం సిద్ధరామయ్య స్పందించి, కారణాలు తెలుసుకు నేందుకు కమిటీని ఏర్పాటు చేశారు. డాక్టర్ రవీంద్రనాథ్ నేతృత్వంలోని కమిటీ పది రోజుల్లో నివేదిక ఇవ్వనుంది. కొవిడ్ టీకాల ప్రభావం, ఇతర ఆరోగ్య సమస్యలపై అధ్యయనం చేయను న్నారు. ప్రజారోగ్యం కోసం ప్రభుత్వం 'హృదయ జ్యోతి', 'గృహ ఆరోగ్య' పథకాలను అమలు చేస్తోంది. పూర్తి వివరాలు మీ కోసం...కర్ణాటకను హార్ట్ ఎటాక్ భయపెడుతుంది. గత కొన్ని రోజులుగా వరుసగా యువత గుండెపోటుతో మృతి చెందడం స్థానికంగా కలకలం రేపుతుంది. కర్ణాటక యువతలో పెరుగుతున్న గుండెపోటు మరణాల పట్ల ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధ రామయ్య ఆందోళన వ్యక్తం చేశారు. వీటికి కారణాలు గుర్తించి.. ఈ సమస్య పరిష్కారం కోసం ఒక కమిటీని కూడా నియమించారు. గత నెలలో అనగా జూన్‌లో ఒక్క హసన్ జిల్లాలోనే ఇరవై మందికి పైగా గుండెపోటు కారణంగా మరణించడం చర్చనీయాంశంగా మారింది. మంగళవారం నాడు కూడా 27 ఏళ్ల సంజయ్ అనే యువకుడు గుండెపోటుతో చనిపోయాడు. ఈ గుండెపోటు మరణాలకు గల కారణాలు, ఇందుకు పరిష్కారం చూపాలంటూ సీఎం సిద్ధ రామయ్య జయదేవ హృద్రోగ ఆసుపత్రుల డైరెక్టర్ డాక్టర్ రవీంద్రనాథ్‌ను ఆదేశించారు. ఆయన నేతృత్వంలో ఉన్నతస్థాయి కమిటీని నియమించారు. పది రోజుల్లో నివేదిక ఇవ్వాలని సీఎం ఆదేశించారు. దీని గురించి ఎక్స్ వేదికగా సిద్ధ రామయ్య పోస్ట్ చేశారు. యువకుల్లో ఆకస్మిక మరణాలపై సమగ్ర అధ్యయనం చేయాలని ఫిబ్రవరి లోనే ఆదేశాలు జారీ చేశామని సీఎం సిద్ధరామయ్య ఈ సందర్భంగా తెలిపారు.




గుండె సంబంధిత సమస్యలు ఉన్న వారిని పరీక్షించి, సమస్యలను విశ్లేషించాలని కమిటీకి సూచించారు. కొవిడ్ టీకాల ప్రభావం, గుండె సంబంధిత సమస్యలపై అధ్యయనం కొనసాగుతోందని సీఎం వెల్లడించారు. హసన్ జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఆకస్మిక మరణాల వెనుక గల కారణాలను గుర్తించి.. వాటిని నివారించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ సమస్యలను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారని బీజేపీ నేతలపై ఆయన మండిపడ్డారు. ప్రజారోగ్యాన్ని పరిరక్షించేందుకు తమ ప్రభుత్వం హృదయ జ్యోతి, గృహ ఆరోగ్య వంటి పథకాలను అమలు చేస్తోందన్నారు.యువత, అమాయక ప్రజల జీవితాలు తమకు చాలా ముఖ్యమని సీఎం సిద్ధరామయ్య ఈ సందర్భంగా స్పష్టం చేశారు. హసన్ జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఈ తరహా ఆకస్మిక మరణాల వెనుక ఉన్న అసలు కారణాలను గుర్తించడానికి ప్రభుత్వం కృషి చేస్తోంది. వాటిని నివారించడానికి కూడా ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.డాక్టర్ రవీంద్రనాథ్ మార్గదర్శకత్వంలోని నిపుణుల కమిటీ నివేదిక ఆధారంగా తగిన చర్యలు తీసుకుంటామని సీఎం తెలిపారు. ఛాతిలో నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలు ఉంటే వెంటనే దగ్గరలోని ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నిర్లక్ష్యం చేయకుండా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కర్ణాటకలో ఒక్కసారిగా ఇన్ని గుండెపోటు మరణాలు నమోదు కావడం పట్ల జనాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# చంద్రబాబుతోనే “సుపరిపాలన” సాధ్యం

## - రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ మన్నె సుబ్బారెడ్డి



**డోన్- సూర్య వాస్తవం, జులై 3:** ఆదోని పట్టణంలో 1వ వార్డు వాల్మీకి నగర్‌లో “సుపరిపాలన లో తొలి అడుగు....ఇంటింటికీ టీడీపీ” కార్యక్రమం ఆదోని మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి భాస్కర్ రెడ్డి గుడిసె కృష్ణమ్మ రాంభూపాల్ చౌదరి రాష్ట్ర కురువ/కురుబ వెల్ఫేర్ కార్పొరేషన్ ఛైర్మన్ దేవేంద్రప్ప శ్రీకాంత్ రెడ్డి.సీడ్స్ ఛైర్మన్ ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి మాట్లాడుతూ అధికారంలోకి రాగానే ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పెంపు చేసి పేదలకు ఆర్థిక భరోసా ను కూటమి ప్రభుత్వం కల్పించింది. అంతేగాక పింఛన్ దారుడు మరణిస్తే శ్పౌజు కింద మరుసటి నెలలో వితంతు పింఛన్ అందజేసి కన్నీళ్లు తుడిచి, ధైర్యాన్ని ఇచ్చింది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అయితే, గత వైసీపీ ప్రభుత్వం శ్పౌజు కింద ఇవ్వకుండా వితంతు మహిళలు కన్నీళ్లు పెట్టుకుండే లాగా చేసారని విమర్శించారు. అంతేకాదు ఒక నెల పింఛన్ తీసుకోకుంటే పింఛన్ల డబ్బులు ఎగ్గొట్టిన చరిత్ర జగన్ ది అయితే, కూటమి ప్రభుత్వం మాత్రం 3 నెలల పింఛన్ ఒకేసారి తీసుకునే అవకాశం కల్పించారు. ఏడాదికి 3 సిలిండర్లు ఉచితంగా అందిస్తున్నాం అన్నారు. అన్న క్యాంటీన్లు పునరుద్ధరణ చేయడమైనది. తల్లికి వందనం కింద అర్హులైన ప్రతి బిడ్డకు రూ.15,000 లు ఆర్థిక సహాయం,పాఠశాలలు తెరిచిన దినమే తల్లికి ఖాతా కు వేయడమైనది. పల్లె పండుగ కార్యక్రమం కింద కోట్ల రూపాయలు వెచ్చించి సీసీ రోడ్లు ఏర్పాటు చేశారు. ఇలా అనేక సంక్షేమ కార్య క్రమాలు ద్వారా పేదలను ఆదుకున్న ఇది మంచి ప్రభుత్వం అని ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి తెలియజేశారు.



# ప్రైవేట్ విద్యా సంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలి

## - పర్మిషన్ లేని ప్రైవేట్ పాఠశాలపైన వెంటనే చర్యలు తీసుకోవాలి
## - ఎంఈఓకి వినతి పత్రం అందజేసిన ఏఐఎస్ఎఫ్

**పామిడి -సూర్యవాస్తవం, జులై 3:** పామిడి మండలం అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ ఎఫ్ ఆధ్వర్యంలో గురువారం రోజున పామిడి మండలంలో స్థానిక ఎంఈఓ జయనాయక్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమం ఉద్దేశించి ఏఐఎస్ఎఫ్ గుంతకల్ నియోజకవర్గం అధ్యక్షులు వి.వినోద్ మాట్లాడుతూ గుంతకల్ నియోజకవర్గం పామిడి మండలంలో ఉన్నటువంటి ప్రైవేట్ విద్యా సంస్థలు ఫీజుల దోపిడీలో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు అదేవిధంగా ఏ విద్యాసంస్థల్లో కూడా ఫీజు స్ట్రక్చర్ నిర్వహించలేదు ఇక్కడ ఉన్నటువంటి ప్రైవేట్ విద్యాసంస్థలు కొన్ని వాటికి పరిమిషన్ లేకుండా రెన్యువల్ చేయకుండా అలాగే నడుపుతున్నారు అదేవిధంగా ప్రతి ఒక్క ప్రైవేట్ విద్యాసంస్థలు బస్సుల సౌకర్యంలో చాల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇలాంటి ప్రైవేట్ విద్యాసంస్థలపైన వెంటనే చర్యలు తీసుకోవాలని తెలియజేస్తున్నాం లేని పక్షమున పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చుడతామని ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ పామిడి మండల నాయకులు చింటూ, వినయ్, మళ్లీ, తదితరనాయకులు పాల్గొన్నారు.

# అన్నమయ్య ప్రాజెక్టు పునరుద్ధరణపై నిర్లక్ష్యం తగదు

## - డీసీసీ అధ్యక్షుడు గాజుల భాస్కర్



**రాయచోటి/రాజంపేట-సూర్య వాస్తవం, జూలై 3:** అన్నమయ్య ప్రాజెక్టు విషయంలో గత ప్రభుత్వం, ఇప్పుడు ఉన్న కూటమి ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి పై అన్నమయ్య జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాజుల భాస్కర్ తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. గురువారం కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి ఆయన తెగిపోయిన అన్నమయ్య ప్రాజెక్టును, ముంపు ప్రాంతాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ “అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోయిన నాటి నుండి ఇప్పటివరకు ఏ ప్రభుత్వమూ పునరుద్ధరణకై వహించక పోవడం,కార్యాచరణ వ్యూహం రూపొందించకపోవడం నిబంధనలకు విరుద్ధం, ప్రజల పట్ల తీవ్ర అన్యాయం” అని విమర్శించారు. ప్రస్తుత జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కోస్తా జిల్లాలపై చూపిస్తూన్న శ్రద్ధ రాయలసీమ జిల్లాలపై లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత వైసిపి ప్రభుత్వం రైతులకు సరైన నష్టపరిహారం కానీ చంద్రబాబు నాయుడు ఎలక్షన్స్ సమయంలో రాజంపేట నియోజకవర్గాన్ని సందర్శించినప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అన్నమయ్య ప్రాజెక్టు పునః నిర్మాణాన్ని యుద్ధ ప్రాతిపదికన నిర్మిస్తామని హమి ఇచ్చిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం కాలం గడుస్తున్నా, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఇంకా ఒక్క అడుగు కూడా ముందుకు వేయకపోవడాన్ని వారు తీవ్రంగా విమర్శించారు. స్థానిక ప్రజల హక్కులను కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ పోరాటాన్ని ముమ్మరం చేస్తుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాజంపేట కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పూల భాస్కర్, డిసిసి చీఫ్ సెక్రటరీ అమీర్, రాయచోటి పట్టణ అధ్యక్షుడు బాబా సర్దార్, మస్తాన్, అమీర్ అమీర్ భాష, షబ్బీర్, రియాజ్, అక్బర్, ఇర్షాద్ అలీ,సుండుపల్లి మండల అధ్యక్షుడు షేక్ సలీమ్, ఇర్ఫాన్,కైఫ్, విష్ణు,మహబూబ్ బాషా, బాబా, జశ్వంత్, అనేకమంది కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు. అన్నమయ్య ప్రాజెక్టు ప్రాంగణంలో పార్టీ జెండాలు ఊపుతూ, న్యాయమైన డిమాండ్ల కోసం నినాదాలు చేశారు.

# డెంగ్యూ జ్వరాలపై విద్యార్థులకు అవగాహన

## - మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ ఐ.సుబ్బరాయుడు



**సిద్దవటం - సూర్యవాస్తవం, జూలై 3:** డెంగ్యూ జ్వరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ ఐ సుబ్బరాయుడు తెలిపారు. సిద్ధవటం ఎగువపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం డెంగ్యూ జ్వరాలపై విద్యార్థులకు అవగాహన కార్య క్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల అన్ని గ్రామాల్లో డెంగ్యూ జ్వరాలు విజృంభిస్తున్నాయన్నారు. డెంగ్యూ జ్వరాలను నివారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలకు, విద్యార్థులకు డెంగ్యూ జ్వరాలపై అవగాహన కల్పించేందుకు ప్రతి ఏడాది జూలై మాసాన్ని జాతీయ డెంగ్యూ మసోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటిలో గానీ, ఇంటి చుట్టు పక్కల గానీ, నిలువ ఉన్న నీటిని గుర్తించి నీటిని తరలిస్తే మంచిదని తెలిపారు. అలాగే ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు శ్రీహరి మాట్లాడుతూ విద్యార్థుల్లో డెంగ్యూ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ వ్యాధి వచ్చిన వెంటనే లక్షణాలను గుర్తించి తగిన వైద్యం చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, విద్యార్ధినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంపై సంఘటిత పోరాటం

- ఏడాదిగా దళిత సామాజికవర్గంపై దాడులు
- గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయండి
- స్థానిక సంస్థల ఎన్నికల్లో మనం సత్తా చాటాలి
- దళితులకు ఎక్కడ అన్యాయం జరిగినా ఎస్సీ సెల్ ముందుండాలి
- ఈ నెల 15 నుంచి ప్రతి ఇంటికి వెళ్లి చంద్రబాబు మోసాలను వివరించండి
- వైసీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పిలుపు



**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, జూలై 3 :** కూటమి ప్రభుత్వంపై సంఘటిత పోరాటానికి సిద్ధం కావాలని వైసీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం వైసీపీ జిల్లా కార్యాలయంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహులు అధ్యక్షతన ఎస్సీ సెల్ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అనంత మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దళిత సామాజిక వర్గంపై దాడులు అధికమయ్యాయని అన్నారు. పార్టీలో ఎవరికైనా విభేధాలు ఉంటే పక్కన పెట్టి క్షేత్రస్థాయి నుంచి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో దళితులకు పెద్దపీట వేశారన్నారు. దళిత మహిళను హెూంమంత్రిని చేశారని గుర్తు చేశారు. 2019 నుంచి 2024 వరకు ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎస్సీల సంక్షేమం కోసం ఏకంగా రూ.70 వేల కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. దేశ చరిత్రలో “నా ఎస్సీ, నా ఎస్టీ” అంటూ దళితులను అక్కున చేర్చుకున్న నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని కొనియాడారు. వైఎస్ జగన్ పాలనలో సామాజిక న్యాయానికి పెద్దపీట వేశామన్నారు. డిబీటీ, నాన్ డీబీటీ కింద ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించామన్నారు. దళితులను పేదరికం నుంచి బయటకు తీసుకొచ్చేందుకు కృషి చేశామన్నారు. రాజకీయ, సామాజిక న్యాయం చేశామని తెలిపారు. పేదల పిల్లలు కూడా ఉన్నత చదువులు అభ్యసించేలా చేశామన్నారు. పోటీ ప్రపంచంలో రాణించేలా ప్రభుత్వ బడుల్లో ఇంగ్లిష్ మీడియం ప్రారంభిస్తే అప్పటి ప్రతిపక్ష నేతలు వ్యతికించిన విషయాన్ని గుర్తు చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయ సాధన కోసం పరితపించిన నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా విజయవాడలో 205 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి గౌరవించారన్నారు. కానీ నేడు కూటమి ప్రభుత్వంలో దళితులపై దాడులు అధికమయ్యాయని, అందరూ కలిసికట్టుగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. దళితులకు ఎక్కడ అన్యాయం జరిగినా ఎస్సీ విభాగం ముందుండాలని సూచించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి దళితులు, గిరిజనులు పట్టుకొమ్మలని అన్నారు. దళితుల సమస్యలపైనే కాకుండా గ్రామ స్థాయిలో నెలకొన్న సమస్యలను కూడా. వెలుగులోకి తీసుకు రావాలని తెలిపారు. రానున్న రోజుల్లో మండల, గ్రామ స్థాయిలో ఎస్సీ సెల్ సమావేశాలు నిర్వహించాలని సూచించారు. మరో ఆరు నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్నాయని, ఆ ఎన్నికల్లో వైసీపీ సత్తా ఏమిటో చూపించాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో నామినేషన్లు కూడా వేయకుండా చేయడం కోసమే రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ నేతలపై దాడులు, అక్రమ కేసులు బనాయిస్తున్నారని తెలిపారు. దళితుల్లో నాయకత్వం లేకుండా చూడాలన్న కుట్ర జరుగుతోందని, అందులో భాగంగానే మాజీ ఎంపీ నందిగం సురేష్‌పై కేసులు పెట్టి వేధిస్తున్నారని తెలిపారు. ఇలాంటి తరుణంలో ప్రతి ఒక్కరూ వ్యూహాత్మకంగా ముందుకు సాగాలని సూచించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ‘రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో’ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. ఈనెల 15వ తేదీ నుంచి గ్రామగ్రామానికి వెళ్లి ప్రజలకు చంద్రబాబు చేసిన మోసాలను వివరించాలన్నారు. పార్టీలో కష్టపడి పనిచేసే వారికి తప్పకుండా న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం ఎస్సీ సెల్ జిల్లా కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

# ముదిగుబ్బ సమీపంలో దారుణహత్య


## - మృతుడు ఓడీచెరువు మండలం గాజుకుంటపల్లి అల్లుడిగా గుర్తింపు






**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, జూలై 3:** శ్రీసత్యసాయి జిల్లా ముదిగుబ్బ మండలంలో దారుణహత్య వెలుగు చూసింది. హత్యకు గురైన వ్యక్తి కడప జిల్లా పులి వెందుల ప్రాంతానికి చెందిన రామప్ప కుమారుడు విశ్వనాథ్‌గా గుర్తించారు. మృతుడు ఓడీచెరువు మండలం గాజుకుంటపల్లిలో పెళ్లి చేసుకున్నట్లు తెలుస్తోంది. ముదిగుబ్బ - కదిరి బైపాస్ లోని పొలాల్లో అత్యంత కిరాతకంగా హతమార్చినట్లు గుర్తించారు. మృతుడు హత్యకు ముందు ముదిగుబ్బకు స్కూటీలో వస్తుండగా దారుణ హత్యకు గురైనట్లు తెలుస్తోంది. తల తెగనరికి వేరు చేశారు. మృతదేహంలోని సగభాగాన్ని కాల్చిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. గురువారం ఉదయమే అటుగా వెళ్తున్న వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు.ముదిగుబ్బ పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకొని పరిశీలించారు. అయితే మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి గుర్తుపట్టడానికి వీలు లేకుండా ఉంది.రెండు భాగాలుగా నరికి కాల్చిన ఆనవాళ్లు కూడా ఉన్నాయి.అయితే ఈ హత్యకు పాల్పడింది ఎవరు, ఎందుకు ఇంత కిరాతకంగా హతమార్చారనే వివరాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

# సీఐ ఇందిరాకు డీఎస్పీగా పదోన్నతి



**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, జూలై 3:** శ్రీ సత్యసాయి జిల్లాలోని పుట్టపర్తి, కొత్తచెరువు సీఐగా విధులు నిర్వర్తించిన ఎం.పీ ఇందిరా డీఎస్పీగా పదోన్నతి పొందారు. ఏడుగురు సీఐలను డీఎస్పీలుగా ప్రమోట్ చేస్తూ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. వారు 15 రోజుల్లో మంగళగిరి పోలీస్ ప్రధాన కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని పేర్కొన్నారు. వీరిలో కర్నూల్ రేంజ్ చెందిన సీ.ఐ ఎంపీ ఇందిరా ఉండటం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

# డీఎస్పీగా పదోన్నతి పొందిన విజయభాస్కర్ గౌడ్



**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, జూలై 3:** ఉమ్మడి అనంత పురం జిల్లాలో సుదీర్ఘంగా పనిచేసిన విజయ భాస్కర్ గౌడ్‌కు డిఎస్పీగా పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర డీజీపీ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో విధులు నిర్వహించిన సీఐలకు పదోన్నతి కల్పించి డిఎస్పీలుగా వారికి క్యాడర్ నిర్దేశించారు. త్వరలోనే వారికి ఆయా ప్రాంతాలలో డిఎస్పీలుగా నియమించను న్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో సిఐలుగా పనిచేసే పదోన్నతి పొందిన వారందరికీ జిల్లా ప్రజలు పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

# టీబీ పేషెంట్లకు పౌష్టికాహారం పంపిణీ



**పుట్టపర్తి – సూర్య వాస్తవం, జూలై 3:** శ్రీ సత్య సాయి జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో టీబి పేషెంట్లకు పౌష్టికాహార పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ టిఎస్ చేతన్ మాట్లాడుతూ.... జిల్లాలో చికిత్స పొందుతున్న 1172 మంది టీబీ పేషెంట్లు, చికిత్స పొందుతున్నారనీ వారికి జిల్లాలో గల రెండు కంపెనీలతో మాట్లాడి వారి సహకారంతో 1172 మంది పేషెంట్లకు పౌష్టికాహారం ఆరు నెలల చొప్పున అందే విధంగా చేశామన్నారు. అలాగే ప్రతి పేషంటు క్రమం తప్పకుండా పౌష్టికాహారంతో పాటు క్రమం తప్పకుండా మందులు కూడా తీసుకోవాలని అలాగే ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలియజేశారు. అదే విధంగా కంపెనీ వారికి కూడా మీరు మరో కంపెనీ వారికి తెలియజేయాలని చెప్పారు. దీనికి కంపెనీ ప్రతినిధులు కూడా మా వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్పాన్సర్స్ సింగ్వా కంపెనీ ప్రతినిధులు శ్రీరాములు, ఏజీ అండ్ పి కంపెనీ ఆదిత్య, డి సి హెచ్ ఎస్ డాక్టర్ మధుసూదన్, డిఎల్ఏటిఓ డాక్టర్ ఎస్ఏ సునీల్ కుమార్, ఎం ఓడిటిసి డాక్టర్ గాయత్రి, డిఎస్ఓ వంశీకృష్ణ, టీబి సిబ్బంది, టీబి పేషెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

# మొహారం పీర్ల పండుగ ఉత్సవానికి టీడీపీ నేత ప్రసాద్ బాబుకు ఆహ్వానం



**రాయచోటి–సూర్య వాస్తవం, జులై 3:** రాయచోటి నియోజకవర్గం పరిధిలో చిన్న మొండెం మండలం చిన్న మొండెం టౌన్‌లో శనివారం 5న జరుగు శ్రీ హజరత్ గంధపు పీరు (పీర్ల పండుగ) కార్యక్రమానికి ఉత్సవ కమిటీ సభ్యులు రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి, టీటీడీ పాలక మండలి మాజీ సభ్యులు రాయచోటి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ నాయకులు సుగవాసి ప్రసాద్ బాబుని తన కార్యాలయంలో కలుసుకుని పీర్ల పండుగ కార్యక్రమానికి ప్రత్యేకంగా ఆహ్వాన పత్రిక అందజేసి ఆహ్వానించినారు. ఈ కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# హత్య కేసులో ప్రేయసి, ప్రియుడికి జీవిత ఖైదు

## - డాన్స్ ప్రోగ్రాం కు అడ్డుగా ఉందని బిడ్డను ప్రియుడితో కలసి చంపిన తల్లి...



**మదనపల్లె – సూర్య వాస్తవం :** డాన్స్ ప్రోగ్రామ్‌కు అడ్డుగా ఉన్న బిడ్డను తన ప్రియుడితో కలసి చంపిన తల్లి, ఆమె ప్రియుడికి మదనపల్లి ఏడిజె కోర్టు జడ్జి జీవిత ఖైదు విధిస్తూ గురువారం మధ్యాహ్నం 3.30 సంచలన తీర్పు చెప్పారు. ఏపీపి జయనారాయణ రెడ్డి కథనం మేరకు.. చిత్తూరు జిల్లా, పుంగనూరు మండలం, సుగాలిమిట్ట పెద్దతండాలో డాన్స్ ప్రోగ్రాంకి 2017లో వెళ్లిన ఐరాల మండలం, మొరవపల్లికి చెందిన బోయకొండ భార్య శాంత (30) రామసముద్రం మండలం, గాజులనగరంకు చెందిన ఆమె ప్రియుడు సుండుపల్లి శ్రీనివాసులు (34) డాన్స్ ప్రోగ్రామ్‌కు అడ్డుగా ఉన్న శాంతా కూతురు శివాని (02) ని శాంత, శ్రీనివాసులు సుగాలి మిట్ట వద్ద గొంతునులిమి హత్య చేశారు. శవాన్ని ఆటోలో తీసుకొచ్చి మదనపల్లె మండలం, చెంబాకూరు రోడ్డు సందిరెడ్డిపల్లి కాలువలో పడేసారు. ఈ కేసులో అప్పటి పుంగనూరు పోలీసులు నిందితులను అరెస్టు చేశారు. కేసు పూర్వాపరాలను విచారించిన పిదప మదనపల్లి ఏడిజే కోర్టులో నిందితులపై నేరం రుజువు కావడంతో ఏడిజే జడ్జి జీవిత ఖైదు విధిస్తూ సంచలన తీర్పు చెప్పారు. అలాగే ఐదు వేలు అపరాధం విధించారు.

# గుత్తి ఏఈగా గోవిందప్ప బాధ్యతలు స్వీకరణ



**గుత్తి – సూర్య వాస్తవం, జూలై 03:** గుత్తి మున్సిపల్ ఏఈ గోవిందప్ప గురువారం బాధ్యతలు చేపట్టారు. ఏ.ఈ గోవిందప్ప గుత్తి మున్సిపల్ కమీషనర్ బి.జబ్బార్ మియా డి.ఈ.ఈ హేమచంద్రని మర్యాద పూర్వకంగా కలిసి జాయినింగ్ రిపోర్ట్ అందించారు. వీరు ఇంతకు మునుపు కర్నూల్ కార్పొరేషన్‌లో భాధ్యతలు నిర్వహిస్తూ బదిలీపై గుత్తి మున్సిపాలిటీకి వచ్చారు.అనంతరం మున్సిపల్ సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు.

# గ్రామాల్లో పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపట్టండి

- నారాయణరెడ్డి పల్లి గ్రామపంచాయతీలో ఆకస్మికంగా తనిఖీ
- ప్రతిరోజు ఉదయం 6 గంటల నుండి ఇంటింటి చెత్త సేకరణ
- కలెక్టర్ శ్రీధర్ చామకూరి



**రాయచోటి–సూర్య వాస్తవం, జూలై 03:** జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఉదయం 6 గంటలకే ఇంటింటి చెత్త సేకరణ పనులు చేపట్టి పారిశుధ్య పనులు ముమ్మరం చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి పంచాయతీ అధికారులు, పారిశుధ్య సిబ్బందిని ఆదేశించారు. గురువారం వాడు ఇచ్చినాడు జిల్లా పరిధిలోని సంబెపల్లి మండలంలోని నారాయణరెడ్డి పల్లి గ్రామంలో చెత్త నుండి సంపద సృష్టి తయారు కేంద్రాన్ని (ఎస్డబ్ల్యూపిసి) జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని గ్రామాల్లోప్రతిరోజు ఉదయం 6 గంటల నుండే ఇంటింటి నుండి తడి చెత్త, పొడి చెత్తను విడివిడిగా సేకరించి చెత్త నుండి సంపద సృష్టి తయారు కేంద్రాలకు తరలించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పారిశుధ్య తనిఖీల్లో భాగంగా నారాయణరెడ్డి పల్లి గ్రామ పంచాయతీలో ఎన్ని గృహాలు ఉన్నాయి, ఎంతమంది పారిశుధ్య సిబ్బంది పనిచేస్తున్నారు, రోజూ ఎంత చెత్త వస్తుంది, సేకరించిన చెత్తను ఎక్కడ డంప్ చేస్తున్నారు, తడి చెత్త పొడి చెత్త విడివిడిగా వేరు చేస్తున్నారా లేదా, నేడు ఎంత మంది నుంచి చెత్త సేకరించారు, గృహాల నుండి చెత్తను ఏ సమయం నుండి ఏ సమయం లోపల సేకరిస్తున్నారు, ట్రై సైకిల్ ఎన్ని ఉన్నాయని, శానిటేషన్ వర్కర్లకు జీతభత్యాలు ఎప్పటివరకు ఇచ్చారు, 15 వ ఆర్థిక సంఘం నిధులు ఎంత ఉన్నాయి సంబంధిత వివరాలను పంచాయతీ సెక్రటరీ రవీంద్రను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. గ్రామ పంచాయతీ పరిధిలో 13 పల్లెలు వున్నాయని... ప్రతిపల్లెలో వారానికి రెండు రోజులు చెత్త సేకరించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ నివేదించారు. పంచాయతీలో ఉన్న నలుగురు పారిశుధ్య సిబ్బందిచే ప్రతి 250 ఇండ్లకు ఒక శానిటేషన్ వర్కర్ చొప్పున ప్రతిరోజు ఆరు గంటల నుండి 10 గంటల వరకు చెత్త సేకరించడం జరుగుతుందని కలెక్టర్ కు వివరించారు. శానిటేషన్ వర్కర్లకు ఏప్రిల్ మాసం వరకు జీతాలు ఇవ్వడం జరిగిందని, 15 ఫైనాన్స్ నిధులు పంచాయతీలో లేవని పంచాయతీ సెక్రెటరీ రవీంద్రా జిల్లా కలెక్టర్ కు నివేదించారు.

అనంతరం నారాయణ రెడ్డి పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని పొన్నేరు వాళ్ళ పల్లి గ్రామాన్ని సందర్శించి గ్రామ ప్రజలతో కలెక్టర్ ముచ్చటిస్తూ గ్రామంలో చెత్త సేకరించుటకు రోజు వస్తున్నారా, లేక వారానికి ఒకసారి వస్తున్నారా అని కలెక్టర్ ప్రశ్నించగా వారానికి రెండు సార్లు వస్తారని గ్రామ ప్రజలు జిల్లా కలెక్టర్ కి తెలిపారు. గ్రామపంచాయతీ పరిధిలో ఇంటి పన్ను లు కడుతున్నారా, నీటి వసతి, రోడ్లు, వీధి దీపాలు తదితర సమస్యల గురించి కలెక్టర్ ఆరాతీశారు.గ్రామపంచాయతీ పరిధిలో ప్రతి ఒక్కరూ ఇంటి పన్ను చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని, గ్రామంలో చెల్లించే పన్నుల ద్వారా వచ్చే నిధుల నుండి పంచాయతీ పరిధిలోని రోడ్లు వీధి దీపాలు, కాలువలు తదితర అభివృద్ధి పనులకు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకొని, విద్యుత్ ను ఆదా చేసి తద్వారా ఆదాయాన్ని పొందాలని కలెక్టర్ తెలిపారు. అలాగే ఐవిఆర్ఎస్ కాల్స్ నందు పురోగతి సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామచంద్ర, డిపిఓ రాధమ్మ, సెక్రటరీ రవీంద్ర , మండల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వం వచ్చాకే

# పల్లెల రూపు రేఖలు మారుతున్నాయి

## - ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, యువ నేత గుమ్మనూరు ఈశ్వర్

**పామిడి– సూర్య వాస్తవం, జులై 3 :** గుంతకల్లు నియోజకవర్గం పామిడి మండలం అనుంపల్లి గ్రామంలో గురువారం రోజున నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు గుంతకల్ శాసన సభ్యులు గుమ్మనూరు జయరాం ఆయన తనయుడు పామిడి, గుత్తి ఇంచార్జ్ గుమ్మనూరు ఈశ్వర్ పామిడి మండలం అనుంపల్లి గ్రామం నందు సుపరిపాలనకు ఏడాది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, ఈశ్వర్, మొదటగా ఒడ్డుగట్ట సుంకులమ్మ వారిని దర్శనం చేసుకుని ప్రత్యేక పూజా కార్యక్రమం లో పాల్గొని అనంతరం ఇంటింటికి తిరిగి ప్రజలకు కూటమి ప్రభుత్వం ఏర్పడిన సంవత్సరం కాలం నుండి ప్రజలకు చేసిన మంచిని అభివృద్ధి కార్యకక్రమాలను ప్రజలకు వివరించారు, ఎమ్మెల్యే,





యువనేత గుమ్మనూరు ఈశ్వర్ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అన్నిన్నిటిని ఒక్కోటిగా నెరవేరుస్తూ వస్తున్నారు, అవ్వ తాతలకు 4000పెన్షన్, తల్లికి వందనం పేరుతో ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమంది పథకం అమలు చేసాం అన్నారు గడిచిన 5 సంవత్సరాల వైస్సార్సీపీ ప్రభుత్వం అమ్మ ఒడి పేరుతో ఇంట్లో ఒకరికి మాత్రమే డబ్బులు ఇచ్చేవారు ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నారా చంద్రబాబు నాయుడు ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమందికి డబ్బులు ఇచ్చి పేద కుటుంబాలకు ఎంతో మంచి చేసారని యువనేత గుమ్మనూరు ఈశ్వర్ తెలిపారు. అనంతరం అనుంపల్లి గ్రామం నందు ఇంతకుముందు డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండేది కూటమి ప్రభుత్వం వచ్చాక ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తనయుడు గుమ్మనూరు ఈశ్వర్ చొరవతో ప్రధాన డ్రైనేజీ కాలువ నిర్మించి గ్రామంలో డ్రైనేజి సమస్య తీర్చారన్నారు.

అలాగే గ్రామం లో సీసీ రోడ్ల నిర్మాణంచేపట్టి ఊరిలో కాలనీలలో రోడ్డు సమస్య లేకుండా చేసారని అన్నారు. ఈ కార్యక్రమంలో పామిడి మండల, పట్టణ కూటమి నాయకులు కార్యకర్తలు అనుబంధ కమిటీ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# విజిబుల్ పోలీసింగ్‌తో ప్రజల భద్రతకు భరోసా..

## - వాహనాల తనిఖీలలో పాల్గొన్న నగర సీఐలు, ఎస్ఐలు




**అనంతపురం క్రైం – సూర్య వాస్తవం, జూలై 3:** జిల్లా కేంద్రంలో పోలీసులు విజిబుల్ పోలీసింగ్ నిర్వహించి వాహనాల తనిఖీలు ముమ్మరం చేశారు. జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాలతో వాహనాల తనిఖీలలో నగర సి.ఐలు, ఎస్సైలు పాల్గొన్నారు. గంజాయి, అక్రమ మద్యం, తదితరాలు అక్రమ రవాణా జరుగకుండా లోతుగా తనిఖీ చేశారు. అంతేకాకుండా... రోడ్డు భద్రతపై దృష్టి సారించారు. ఆటోలలో అధిక లోడ్‌తో ప్రయాణీకులు తరలించకుండా, మద్యం సేవించి వాహనాలు నడపకుండా, త్రిబుల్ రైడింగ్ వెళ్లకుండా తనిఖీ చేశారు. అనంతపురం ఒన్ టౌన్, టూటౌన్, త్రీటౌన్, ఫోర్త్ టౌన్ రూరల్ , ట్రాఫిక్ పోలీసులు ముఖ్య కూడళ్లు, ప్రధాన వాహనదారులపై వాహనాల తనిఖీ నిర్వహించి ట్రాఫిక్ ఉల్లంఘనలపై చర్యలు తీసుకున్నారు. నగరంలో వాహనాల రాకపోకలు సులువుగా సాగేలా చర్యలు చేపట్టారు.



# వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి

**రాయచోటి – సూర్య వాస్తవం, జులై 3:** విజయవాడ ఏపీ సచివాల యంలోని సిఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా, నియోజకవర్గ విజన్ ప్రణాళికలపైసమావేశాల నిర్వహణ, సానుకూల ప్రజా అవగాహన, ఫేషియల్ రికగ్నేషన్, సౌర ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ, పీఎం సూర్య ఘర్ పథకం, ఎస్ హెచ్‌జి బృందాలకు జీవనోపాధి వార్షిక రుణ కార్యాచరణ ప్రణాళిక, సూక్ష్మ రుణ ప్రణాళిక అమలు, రుతుపవనాల సంసిద్ధతతదితర అంశాలపై జిల్లా కలెక్టర్లు, జేసీలతో గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. రాయచోటి కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి, జేసి ఆదర్శ్ రాజేంద్రన్ డిఆర్ఓ మధుసూదన్ రావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వం గిరిజన సలహా మండలి కౌన్సిల్‌గా పి.వెంకటపతి



**పతికొండ టౌన్ - సూర్య వాస్తవం, జూలై 3:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ గిరిజన సలహా మండలి కౌన్సిల్‌గా పి.వెంకటపతి గురువారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడలో గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎం. మల్లికార్జున నాయక్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని తీసుకుని రాష్ట్ర ప్రభుత్వ గిరిజన సలహా మండలి కౌన్సిల్ గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం వెంకటపతి గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎమ్. మల్లికార్జున నాయక్ ను శాలువాతో సత్కరించారు. అనంతరం గిరిజనుల అభివృద్ధికి తీసుకోవలసిన కొన్ని విషయాలను ప్రిన్సిపల్ సెక్రెటరీ కు వెంకటపతి వివరించినట్లు తెలిపారు. ముఖ్యంగా కర్నూలు జిల్లా లో ని తుగ్గలి మండలం రాష్ట్రంలోనే రెండవ గిరిజన మండలంగా ప్రభుత్వం గుర్తించిందని తెలిపారు. అందువల్ల ఆ మండలంలో గిరిజనలు 100 శాతం అక్షరాస్యత సాధించేందుకు ఏకలవ్య గురుకుల పాఠశాలను మంజూరు చేయాలని, అలాగే 14 గిరిజన తండాలకు శాశ్వతంగా త్రాగునీటి సమస్య పరిష్కరించేందుకు చెన్నంపల్లి వద్ద రిజర్వాయర్ ఏర్పాటు చేసే అక్కడి నుండి తండాలకు మంచినీటి సరఫరా చేయాలని కోరినట్లు తెలిపారు. అందుకు ప్రిన్సిపల్ సెక్రెటరీ సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు. ఇప్పటికే మండలంలో గిరిజనుల విద్యాభ్యాసం కోసం ఎమ్మెల్యే కెఈ శ్యామ్ కుమార్ ప్రత్యేక చొరవ తీసుకున్నారని తెలిపారు.

## స్థానిక సంస్థల ఎన్నికలలో సత్తా చాటుదాం

**- వైసీపీ జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి పామిడి సాకే ఓబులేసు**



**పామిడి - సూర్య వాస్తవం, జూలై 3:** అనంతపురం జిల్లా కేంద్రంలో గల వైఎస్ఆర్సిపి పార్టీ కార్యాలయంలో వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో ఎస్సీ సెల్ రాష్ట్ర కమిటీ సభ్యులకు జిల్లా కమిటీ నగర కమిటీ సభ్యులకు అసెంబ్లీ నియోజకవర్గం టౌన్ మండల విభాగ అధ్యక్షులతో గురువారం ఎస్సీ సెల్ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ మనమంతా తిరుగులేని ఐక్యతతో స్థానిక సంస్థలను చాకచక్యంతో మనం కైవసం చేసుకోవాలన్నారు. అనంతరం ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పామిడి సాకే ఓబులేసు మాట్లాడుతూ ఎటువంటి స్వార్థం లేకుండా నిస్వార్థంతో నా ఎస్సీ లు అని పలికిన నాయకుడు ఎవరన్నా ఉన్నారంటే అది ఒక్క జగన్మోహన్ రెడ్డి మాత్రమే అని అన్నారు. రాష్ట్ర చరిత్ర లో ఎస్సీ మహిళకు మొట్టమొదటిసారిగా హోం మంత్రి ఇచ్చిన ఘనత ఒక వైయస్ జగన్మోహన్ రెడ్డి మాత్రమే అన్నారు. మన జగనన్న, వెనుకబడిన తరగతులను సామాజికంగా ముందుకు తీసుకురావడానికి సామాజిక సంస్కరణలు తీసుకొచ్చాడు అన్నారు. ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను కూడా తీసుకొచ్చాడు అన్నారు. అదేవిధంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో మనమందరం కృషిచేసి వైఎస్ఆర్సిపిని బలోపేతం చేస్తూ మన సత్తా చాటాలన్నారు. పలువురు నాయకులు మాట్లాడుతూ వెనుకబడిన తరగతులకు న్యాయం జరగాలంటే అది ఒక వైఎస్ఆర్సిపి తోనే సాధ్యమన్నారు.

## వాట్సాప్ గ్రూపులపై నిఘా వేగవంతం

**- సిద్దవటం ఎస్సై మహమ్మద్ రఫీ**



**సిద్ధవటం - సూర్య వాస్తవం, జూలై 3:** సిద్ధవటం మండలంలోని కొన్ని వాట్సాప్ గ్రూపులు ఏర్పరచుకొని ఇతరులకు ఇబ్బంది పెట్టే విధంగా పోస్టింగులు పెట్టే వారిపై నిఘా ఏర్పాటు చేస్తామని సిద్ధవటం ఎస్సై మహమ్మద్ రఫీ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్ లో గురువారం ఆయన మాట్లాడుతూ కొన్ని వాట్సాప్ గ్రూపులలో కొందరిని ఉద్దేశించి కామెంట్లు పెడుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. అలాగే గ్రూపులలో అసభ్య పదజాలతో మెసేజ్ లు పెడుతున్నారని వాటిపై నిఘా ఏర్పాటు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కొంతమంది విలేకరులని చెప్పుకుంటూ టూ వీలర్, ఫోర్ వీలర్ వాహనాలపై ప్రెస్ స్టిక్కర్ ఏర్పాటు చేసుకున్నారని వాహనాలను తనిఖీల్లో పట్టుబడితే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేసే గుర్తింపు పొందిన పత్రికా విలేకరులకే ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

## ఉగ్రవాదుల స్థావరాలపై పోలీసుల దర్యాప్తు ముమ్మరం





**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం, జూలై 3:** రాయచోటిలో 30 ఏళ్లుగా స్థావరాలు ఏర్పరచుకున్న ఉగ్రవాదులపై పోలీసులు కేసులు నమోదు చేశారు. తమిళనాడులో జరిగిన వరుస బాంబు పేలుళ్ల కేసులో మోస్ట్ వాంటెడ్‌గా ఉన్న ఉగ్రవాదులు అబూబకర్ సిద్ధిఖీ, మహమ్మద్ మన్సూరు అలీని 3 రోజుల కిందట ఐబీ అధికారులు అరెస్ట్ చేసి చెన్నైకి తీసుకెళ్లారు. ఐబీ అధికారులు అరెస్ట్ చేసిన తర్వాత రాయచోటి పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. వారి ఇళ్లలో సోదాలు నిర్వహించి అనేక పేలుడు పదార్థాలు, బకెట్ బాంబులు, సూట్‌కేస్ బాంబులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఇక్కడ స్థావరాలు ఏర్పరచుకున్న ఉగ్రవాదులపై రాయచోటి పోలీసులు వేర్వేరుగా రెండు కేసులు నమోదు చేశారు. అబూబకర్ సిద్ధిఖీ అలియాస్ అమానుల్లా, ఆయన భార్య షేక్ సైరాబానుపై ఉపా యాక్ట్, పేలుడు పదార్థాల చట్టం, ఆర్మ్ యాక్ట్ కింద కేసులు నమోదు చేశారు. మరో కేసులో ఉగ్రవాది షేక్ మన్సూర్ అలీ, ఆయన భార్య షమీం పైన ఇవే సెక్షన్లు వర్తింపజేస్తూ కేసులు నమోదు చేశారు. ఇవాళ షేక్ సైరా భాను, షేక్ షమీంను అరెస్ట్ చేసి రాయచోటి కోర్టులో హాజరుపరిచారు.

## ఎమ్మెల్యే గురించి మాట్లాడేటప్పుడు నోరు జాగ్రత్త..!

**- మేయర్ వసీంకు అర్బన్ టీడీపీ నేతల హెచ్చరిక - ఆయన మీలాగా ఏదిపడితే అది మాట్లాడరు**

**- మీరు మంచి చేసి ఉంటే 11సీట్లకు ఎందుకు పరిమితం అవుతారు - ముందు అనంత ఫోబియా నుంచి బయటకొచ్చి చూడు**




**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, జూలై 3:** ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ గురించి మాట్లాడేటప్పుడు నోరు జాగ్రత్తగా పెట్టుకుని మాట్లాడాలని అనంతపురం అర్బన్ నియోజకవర్గ టీడీపీ నాయకులు మేయర్ వసీంని హెచ్చరించారు. బుధవారం రోజు మేయర్ వసీం చేసిన వ్యాఖ్యల మీద టీడీపీ నాయకులు తీవ్రంగా స్పందించారు. అర్బన్ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి సరిపూటి రమణ, బిసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి దళవాయి వెంకటనారాయణ, తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే లక్ష్మీనరసింహ, మైనార్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఫిరోజ్ అహ్మద్, ఎస్సీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి వన్నూరప్ప, కార్పోరేటర్ బాలాంజనేయులు, మాజీ కార్పొరేటర్ రాజారావులు పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ జగన్ బుద్ధి లేని పనులు చేస్తున్నాడు కాబట్టే ఆయనకు బుద్ధి లేదని ఎమ్మెల్యే దగ్గుపాటి అన్నారన్నారు. ఐదేళ్ల పాటు రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిపెట్టిపోతే ముఖ్యమంత్రి చంద్రబాబు ఏడాది కాలంలో మళ్లీ గాడిలో పెట్టారన్నారు. ఇలాంటి సమయంలో రీకాల్ చంద్రబాబు మ్యానిఫెస్టో లాంటి కార్యక్రమాలు పెడితే ఎవరైనా ఇలాగే మాట్లాడుతారన్నారు. మీరు చెప్పినట్టుగా ఐదేళ్లలో మీరు అంత మంచి చేసి ఉంటే ఎందుకు 11సీట్లకు పరిమితం చేస్తారని ప్రశ్నించారు. వసీం మేయర్ గా ఎన్నికై నాలుగేళ్లు గడిచినా ఇంకా ఆయన అంకుల్ అనంత వెంకట్రామిరెడ్డి ఫోబియా నుంచి బయటకు రావడం లేదన్నారు. పైగా వైసీపీకి కనీసం ప్రతిపక్షం కూడా లేదన్న సంగతి తెలుసుకోవడం లేదన్నారు. మీరు అధికారంలో ఉండగా ఏ ఒక్కరికీ మంచి చేయలేదు కాబట్టే ప్రజలు మాకు అధికారం ఇచ్చారన్నారు. మరీ ముఖ్యంగా మీ అంకుల్ తో పాటు మీరు చేసిన అవినీతికి చెంపపెట్టులా అర్బన్ నియోజకవర్గంలో ప్రజలు తీర్పునిచ్చారన్నారు. గతంలో ఎవరికీ రానంత మెజార్టీతో దగ్గుపాటి ప్రసాద్ ను గెలిపించారన్నారు. ప్రజలు ఆయనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఏడాది కాలంలోనే మార్పు ఎలా ఉంటుందో చూపించారన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో 118కోట్ల రూపాయలతో వివిధ రకాల అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. పార్టీలు చూడకుండా, రాజకీయాలు చేయకుండా నగరంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. మా పార్టీ కక్ష సాధింపులకు పాల్పడితే వైసీపీ నాయకులు ఇంత స్వేచ్ఛగా బయట ఎలా తిరుగుతున్నారు అన్నారు. ఇప్పటికే మీరు నగరపాలక సంస్థలో అవినీతి గురించి విచారణ జరుగుతోందని.. మీతో పాటు అనంత వెంకట్రామిరెడ్డి కూడా దీని నుంచి తప్పించుకోలేరన్నారు. మీలాగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఎదిపడితే అది మాట్లాడరని.. ఆయన వాస్తవాలు ఉంటేనే మాట్లాడుతారన్నారు. ఇప్పటికైనా మేయర్ నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని టీడీపీ నాయకులు సూచించారు.

## ఈ నెలలోనే కాలువ పనులు పూర్తి కావాలి

**- నీటిపారుదల అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించిన ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు**



**కనేకల్ - సూర్య వాస్తవం, జూలై 3:** ఈనెల పది లోపు హెచ్.ఎల్.సి ఆధునీకరణ పనులన్నీ పూర్తి చేయాలని కాంట్రాక్టర్లు, అధికారులను ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ఆదేశించారు. కాలువకు పదవ తేదీ నుంచి నీటిని విడుదల చేయాలని కర్ణాటక అధికారులు తుంగభద్ర బోర్డును కోరారన్నారు. కర్ణాటక అధికారుల విన్నపం మేరకు కాలువకు వీటిని విడుదల చేయనున్నందున ఈలోపు పనులన్నీ పూర్తి చేసి నీటి పంపిణీకి ఏటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. హెచ్ ఎల్ సి మరమ్మతు పనులను గురువారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వైకాపా పాలనలో తుంగభద్ర ఎగువ కాలువ దుస్థితి దయనీయంగా మారిందన్నారు. పాలకుల నిర్లక్ష్యానికి జిల్లా రైతాంగం తీవ్రంగా నష్టపోయిందన్నారు. వైకాపా నేతలు జిల్లా భవిష్యత్తును దారుణంగా దెబ్బతీశారన్నారు. కాలువ బలహీనంగా ఉన్న ప్రాంతాల్లో సైతం ఎటువంటి మలమ్మతులు చేపట్టలేదు అన్నారు. ఐదేళ్ల పాలనలో కనీసం గంపెడు మట్టి ఎత్తిపోయే లేదని ఎద్దేవా చేశారు. చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కాలువ స్థితిగతులపై అధ్యయనం చేశామన్నారు. కాలువ బలహీనపడ్డ ప్రాంతాలను గుర్తించి యుద్ధ ప్రతిపాదికన పనులు చేయించడానికి కోటి రూపాయలు మంజూరు చేశామన్నారు. దాంతో గత సీజన్లో నీటి పంపిణీకి ఎలాంటి ఇబ్బందులు ఎదురు కాలేదన్నారు. కాలువ గట్టు, బలహీనపడ్డ ప్రాంతాలను పరిశీలించి సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. జిల్లా పట్ల ఆయనకున్న ప్రత్యేక అభిమానం, రైతుల పట్ల ఉన్న మమకారంతో వెంటనే రూ.35 కోట్లు మంజూరు చేశారన్నారు. జిల్లా పట్ల ఆయనకున్న ప్రత్యేక అభిమానాన్ని జరుగుతున్న పనులే ప్రత్యక్ష నిదర్శనమని గుర్తు చేశారు. ముఖ్యంగా కనేకల్లు ప్రాంతాల్లో జరుగుతున్న పనుల విధానం చూస్తే రాయదుర్గ ప్రాంతానికి మంచి రోజులు వచ్చాయన్నారు. తుంగభద్ర ప్రాజెక్టు నుంచి జిల్లా వ్యాప్తంగా వెళ్లాల్సిన సాగునీటికి ఎటువంటి అంతరాయం కలగకుండా మార్గం సుగుమమావుతోదన్నారు. చంద్రబాబు ఆశీస్సులు, జిల్లాకు చెందిన రాష్ట్ర ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్, నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రత్యేక చొరవతో పనులు వేగవంతం అవుతున్నాయన్నారు. జిల్లా రైతాంగం ఆ ముగ్గురికి ఎప్పటికీ రుణపడి ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ లాలేప్ప, ఉప్పర ఆనందరాజు, ఆది, సుదర్శన్, వన్నా రెడ్డి, బిటి రమేష్, చాంద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## మహిళా కూలీలతో కాలవ శ్రీనివాసులు మాటామంతి



**కనేకల్ - సూర్య వాస్తవం, జూలై 3:** కణేకల్లు మండలం ఆదిగానిపల్లి సమీపంలో పొలం పనుల్లో ఉన్న మహిళా కూలీలను కలిసిన ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పత్తి చేనులో కోతల్లో నిమిగ్నమై ఉన్న మహిళలు గురువారం ఉదయం అటుగా వెళుతున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులును గమనించి ఆయనతో మాట్లాడేందుకు రోడ్డు వద్దకు వచ్చారు. దీంతో ఆయనే వాహనం దిగి పొలంలోకి వెళ్లి అక్కడ పనిచేస్తున్న వారిని కలిసి మాట్లాడారు. తల్లికి వందనం సొమ్ము అందరి పిల్లలకు అందిందా లేదా అని ఆరా తీశారు. చెప్పిన మాట ప్రకారం ముఖ్యమంత్రి చంద్రబాబు తమ పిల్లలందరికీ డబ్బులిచ్చారని వారు ఆనందంగా ఎమ్మెల్యేకు చెప్పారు. వారిలో ఇద్దరు మాత్రం తమ పిల్లలకు ఇంకా రాలేదని త్వరలో వస్తుందని సంభందిత ఉద్యోగులు చెప్పారన్నారు. పెన్షన్ డబ్బులు పెంచడం, ఉచితంగా గ్యాస్ సిలిండర్లు ఇవ్వడం తమకెంతో ఆనందాన్ని కల్గిస్తోందని మహిళలు పేర్కొన్నారు. ఇంకా రైతుల ఖాతాల్లో త్వరలో డబ్బులేస్తామని, ఆగస్టులో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ యోగం కలుగుతుందని ఎమ్మెల్యే కాలవ వారికి వివరించారు. ఇన్ని మంచి పనులు చేస్తున్న చంద్రాబాబును మహిళలందరూ నిండు మనసుతో ఆశీర్వదించాలని ఎమ్మెల్యే వారిని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ లాలేప్ప, ఉప్పర ఆనంద రాజు, ఆది, సుదర్శన్, వన్నా రెడ్డి, బిటి రమేష్, చాంద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## వైద్య ఆరోగ్యశాఖలో ఉద్యోగం చేయడం ఎంతో పుణ్యం

**- డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ రఘురాం రెడ్డి**



**పత్తికొండ టౌన్ - సూర్య వాస్తవం, జూలై 3:** డిప్యూటీ డిఎంహెచ్వో రఘురామిరెడ్డి మాట్లాడుతూ, వైద్య ఆరోగ్యశాఖలో ఉద్యోగం చేయడం ఎంతో పుణ్యం అని డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ రఘురాం రెడ్డి అన్నారు. గురువారం పగిడిరాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన పబ్లిక్ హెల్త్ నర్సు లక్ష్మీదేవి పదవీ విరమణ సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పదవీ విరమణ చేసిన లక్ష్మీదేవి హెల్త్ అసిస్టెంట్ గా, సూపర్వైజర్ గా, పబ్లిక్ హెల్త్ నర్స్ గా ఈ ప్రాంతంలో పనిచేసి ఎంతో మంది పేదలకు వైద్యం అందించి ఈ ప్రాంత ప్రజల మన్నలను పొందారని తెలిపారు. పదవీ విరమణ చేసిన లక్ష్మీదేవి మాట్లాడుతూ తన పదవీకాలం ఎక్కువ గా పగిడిరాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేశానని, ఈ ప్రాంత ప్రజలు తనను ఎంతో ఆదరించారని, వారు ఆదరణను ఎప్పటికీ మరువనన్నారు. అలాగే తనతో పనిచేసిన వైద్య సిబ్బంది, వైద్యులు కూడా తనకు ఉద్యోగరీత్యా సహకారం అందించారని వారి సహకారం కూడా మరువనని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారి లు డాక్టర్ ఎం. ఎం. పాషా, డాక్టర్ సుజాత, ఏపీ ఎన్జీవో సంఘం నేత సాయిబాబా, రిటైర్డ్ రెవెన్యూ ఉద్యోగుల సంఘం నేత టిఎండి హుస్సేనీ, ఎం పి హెచ్ ఈవో బండయ్య, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, సీనియర్ అసిస్టెంట్ పరమేష్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

**- చేసేదివే చెప్తాం - చెప్పినవే నెరవేరుస్తాం**

**- సుపరిపాలనకు ఇది తొలి అడుగు మాత్రమే - ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి**



**చెన్నూరు - సూర్య వాస్తవం, జూలై 3:** సంవత్సరం క్రితం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ప్రజలకి ఏవైతే హామీలు ఇవ్వడం జరిగిందో వాటన్నిటిని కూడా ఏడాది లోపే 80% శాతం పరిష్కరించడం జరిగిందని, ఇంకా 4 సంవత్సరాలలో గ్రామాలలోని గడపగడపకు వెళ్లి అక్కడ ఉన్న సమస్యలను తెలుసుకొని, ఆ మండల పరిధిలో ఉన్న అధికారులచే పరిష్కరించడం జరుగుతుందని, రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడు జరగని విధంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజలకు ఒక మంచి సుపరిపాలన అందించడం జరుగుతుందని, కమలాపురం శాసనసభ్యులు పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పుత్తా నరసింహారెడ్డిలు అన్నారు. గురువారం మధ్యాహ్నం సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మండలంలోని రామనపల్లె గ్రామానికి ఎమ్మెల్యే పుత్తాకృష్ణ చైతన్య రెడ్డి, ఆయన తండ్రి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పుత్తా నరసింహారెడ్డి రావడం జరిగింది. వీరి రాకను పురస్కరించుకొని టిడిపి నాయకులు కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొని వారికి మంగళ వాయిద్యాలతో, పూల మాలలతో టపాకాయలు పేలుస్తూ ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామంలోని ప్రతి ఒక్కరిని పలకరించడం జరిగింది. అనంతరం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల మేనిఫెస్టోలో ఏవైతే ప్రజలకు హామీ ఇచ్చారో వాటన్నిటిని 80 శాతం పూర్తి చేయడం జరిగిందన్నారు. గతంలో 3000 ఉన్న పెన్షన్లు 4000 రూపాయలకు పెంచడం జరిగిందని, మహిళలకు ఇస్తామన్న ఉచిత మూడు గ్యాస్ సిలిండర్లను ఇవ్వడం జరిగిందన్నారు. తల్లికి వందనం ద్వారా ఇంట్లో ఎంతమంది విద్యార్థులు చదువుతున్న వారందరికీ తల్లికి వందనం పేరుతో 15వేల రూపాయలు పాఠశాలలు తెరిచి తెరవంగానే తల్లుల బ్యాంక్ ఖాతాలలో జమ చేయడం జరిగిందన్నారు. అతి త్వరలోనే అన్నదాత సుఖీభవ ద్వారా రైతుల బ్యాంకు ఖాతాలలో 20 వేల రూపాయలు జమ చేయడం జరుగుతుందన్నారు. అంతేకాకుండా ఆగస్టు 15 నుండి మహిళలందరికీ ఉచిత బస్ ప్రయాణం కల్పించడం జరుగుతుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సరంలోపే ఇలా చెప్పిన పనులన్నీ కూడా నెరవేర్చడం జరిగిందన్నారు. అందరికీ మంచి చేయాలని సహృదయం కలిగిన నాయకుడు, ఒక విజన్ ఉన్న ముఖ్యమంత్రి ఎవరైనా ఉన్నారంటే అది నారా చంద్రబాబు నాయుడు అని సగర్వంగా చెప్పగలమని వారు తెలియజేశారు. నేను ఎమ్మెల్యేగా అయిన తరువాత మొట్టమొదటిసారిగా 80 లక్షల రూపాయలతో రామనపల్లె గ్రామంలో సిమెంట్ రోడ్డు పనులు చేపట్టడం జరిగిందన్నారు. ఇవే కాకుండా ఆర్ అండ్ బి ద్వారా రామనపల్లె, రాచినాయపల్లె రోడ్డు నిర్మాణం పనులు చేపడతామని తెలియజేశారు. రామనపల్లె నుండి చెన్నూరు వెళ్లే రహదారి పనులు త్వరలోనే ప్రారంభం కానుందని ఆయన తెలిపారు. రామన్న పల్లె గ్రామ ప్రజలు తమను నమ్మి మాకు మంచి మెజారిటీ ఇవ్వడం జరిగిందని ఇక్కడి ప్రజలకు సేవ చేసే భాగ్యం కలిగినందుకు సంతోషంగా ఉందని తెలిపారు. సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ కాలవలు, పక్కా గృహాలు, త్రాగునీటి సమస్య, ఇలా ఏవైనా కూడా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని వారు ప్రజలను కోరారు. ఎ ఇందుకు సంబంధించి ప్రతి గ్రామంలో బూత్ కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందని వారందరూ కూడా ఆయా గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి అక్కడి సమస్యలను మండల అధికారుల దృష్టికి తీసుకుపోవడం జరుగుతుందన్నారు. ఆ సమస్యలను అధికారులు పట్టించుకోకపోతే తమ దృష్టికి తీసుకురావాలని ఆయా సమస్యలను మేము పరిష్కరిస్తామని వారు ప్రజలకు హామీ ఇవ్వడం జరిగింది. అదేవిధంగా గ్రామంలోని ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని వారు తెలపడంతో గ్రామస్తులు వారి దృష్టికి అనేక సమస్యలను తీసుకురావడం జరిగింది. ఇందులో కరెంటు తీగలు తమ ఇళ్ళ మీద ఉన్నాయని వర్షం వస్తే చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కొంతమంది గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి ఆయన ఆ సమస్యను విద్యుత్ ఏఈ తో మాట్లాడడం జరిగింది. అలాగే కొంతమంది డ్రైనేజీ సమస్య పెన్షన్ సమస్య గృహ నిర్మాణాల సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా ఆయన అక్కడ ఉన్న అధికారులను పిలిచి ఈ సమస్యలను పరిష్కరించాలని సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు మనోహర్ నాయుడు, టిడిపి మండల కన్వీనర్ కల్లూరు విజయ భాస్కర్ రెడ్డి, కేసీ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ తాడిగొట్ల వెంకటసుబ్బారెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ ఇందిరెడ్డి శివారెడ్డి, మాజీ అటవీశాఖ డైరెక్టర్ శ్రీ లక్ష్మి, మార్కెట్ యార్డ్ ఉపాధ్యక్షులు చలపతి, టిడిపి రైతు విభాగం అధ్యక్షులు గుమ్మల్ల మల్లికార్జున రెడ్డి, పుత్తామహేంద్ర రెడ్డి, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మన్సూర్ అక్బర్, టిడిపి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి ఆవుల పవన్ కుమార్ రెడ్డి, జిల్లా బీసీ సెల్ నాయకులు సుబ్రహ్మణ్యం, తెలుగుదేశం నాయకులు మురళి, ఉదయగిరి వెంకటేష్, ఉదయగిరి సుబ్బరాయుడు, నక్క గురప్ప, కత్తి లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

## త్వరలోనే పార్టీ నూతన కమిటీలను ప్రకటిస్తాం

**- అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ప్రకటన**

**- పార్టీ పరిశీలకులతో కలిసి అర్బన్ కార్యాలయంలో సమావేశం**

**- కమిటీల ఎంపిక తుది దశకు వచ్చిందన్న ఎమ్మెల్యే దగ్గుపాటి**



**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, జూలై 3:** అనంతపురం అర్బన్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నూతన కమిటీలు ఎంపిక తుది దశకు వచ్చిందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. పార్టీ సంస్థాగత ఎన్నికల పై అర్బన్ టీడీపీ కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ పరిశీలకులు కర్నూల్ అర్బన్ అథారిటీ చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి రామ్మోహన్ చౌదరి, కుమ్మర సాధికార కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు పోతులయ్య, అనంతపురం నియోజకవర్గ పరిశీలకుడు లక్ష్మీనారాయణ ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు. టిడిపి రాష్ట్ర కమిటీ నాయకులతో కలిసి నూతన కమిటీల ఎంపికపై చర్చించారు. నగర కమిటీ, క్లస్టర్ ఇన్చార్జిలపై కసరత్తు నిర్వహించారు. ఇప్పటికే నూతన కమిటీలు ఎంపిక తుది దశకు వచ్చిందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి తెలిపారు. తొందర్లోనే నగర కమిటీ, క్లస్టర్ ఇంచార్జిలు, మరియు డివిజన్ ఇన్చార్జిలను ప్రకటిస్తామని చెప్పారు. ఇందుకోసం అందరి అభిప్రాయాలు స్వీకరించామని పార్టీలో కష్టపడ్డ ఏ ఒక్క నాయకునికి అన్యాయం జరగదని ఎమ్మెల్యే దగ్గుపాటి స్పష్టం చేశారు.

## కలెక్టర్‌కు పుష్పగుచ్ఛంతో అభివాదం తెలిపిన తహాశీల్దార్ గోపీనాథ్ రెడ్డి




**తిరుపతి, పెళ్లకూరు - సూర్యా వాస్తవం, జూలై 03:** సూళ్లూరుపేట తహసిల్దారుగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన పెళ్లూరు గోపీనాథ్ రెడ్డి, గురువారం జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి, తన అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు. తన విధుల్లో కలెక్టర్ సూచనలు, మార్గదర్శకాలను పాటిస్తూ ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని గోపీనాథ్ రెడ్డి తెలిపారు.

# డిమాండ్‌కు తగ్గ పంటలు వేయండి

**- రైతులకు చంద్రబాబు హితవు - మామిడి రైతులు - పల్ప్ పరిశ్రమ కలిసి పనిచేయాలి**

**- మామిడి కొనుగోలు చేసి రైతును ఆదుకోవాలని పరిశ్రమలకు ఆదేశం**

**- ఉమ్మడి చిత్తూరు జిల్లా మామిడి రైతులు పల్ప్ పరిశ్రమ ప్రతినిధులతో ముఖ్యమంత్రి సమావేశం**



**కుప్పం - సూర్య వాస్తవం, జూలై 3:** మామిడి రైతులు పల్ప్ పరిశ్రమ కలిసి పనిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. కుప్పంలోని తన నివాసంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా మామిడి రైతులు, పల్ప్ పరిశ్రమల ప్రతినిధులు, ప్రాసెసింగ్ యూనిట్లతో ముఖ్యమంత్రి సమావేశం నిర్వహించారు. రైతుల నుంచి తక్షణం మామిడి కొనుగోలు చేసి వారిని ఆదుకోవాలని ప్రాసెసింగ్, పల్ప్ పరిశ్రమలను సీఎం ఆదేశించారు. అదే సమయంలో పల్ప్ పరిశ్రమలు, ప్రాసెసింగ్ యూనిట్లను కూడా ప్రభుత్వం ఆదుకుంటుందని అన్నారు. మామిడి రైతులకు భవిష్యత్తులోనూ ఎలాంటి సమస్యా లేకుండా ప్రభుత్వం వైపు నుంచి కార్యాచరణ చేపడతామని సీఎం హామీ ఇచ్చారు. ఇప్పటి వరకూ 1.12 లక్షల మెట్రిక్ టన్నుల మామిడి కొనుగోలు జరిగిందని ఇంకా 1.70 లక్షల మెట్రిక్ టన్నుల వరకూ ఉత్పత్తి ఇంకా రావాల్సి ఉందని ఈ సమావేశంలో అధికారులు సీఎంకు వివరించారు. మరోవైపు ఆర్డర్లు లేవని, నిల్వ చేసుకోడానికి స్థలం లేదని పల్ప్ పరిశ్రమలు మామిడిని కొనుగోలు చేయటం లేదని రైతులు సీఎం దృష్టికి తీసుకువచ్చారు. కొన్ని చోట్ల అన్ లోడింగ్ కోసమే 3-4 రోజుల సమయం పడుతోందని ముఖ్యమంత్రికి విన్నవించారు. దీనిపై స్పందించిన సీఎం తక్షణం ఉత్పత్తిని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని ప్రాసెసింగ్ యూనిట్లు, పల్ప్ పరిశ్రల ప్రతినిధులకు సూచించారు. మరోవైపు పాకిస్తాన్, ఆఫ్రికన్ దేశాల్లో దిగుమతి సుంకాలు లేవని , యూరోపియన్ దేశాల్లో దిగుమతి సుంకాలు ఎక్కువగా ఉన్నాయని మ్యాంగో పల్ప్ పరిశ్రమలు, ఎగుమతిదారులు సీఎం కు తెలియచేశారు. సుంకాలు తగ్గించేలా ఆయా దేశాలను ఒప్పించేందుకు కేంద్రంతో మాట్లాడాలని కోరారు. అలాగే మ్యాంగో పల్ప్ పై విధిస్తున్న జీఎస్టీని 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గించేలా మాట్లాడాలని సీఎంకు విన్నవించారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి జీఎస్టీ తగ్గింపు పై ఇప్పటికే కేంద్రానికి లేఖ రాశామని.. మరోమారు దీనిపై మాట్లాడతానని హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఎకరాకు 6-12 టన్నుల మేర మామిడి ఉత్పత్తి వచ్చిందని రైతులకు మంచి ధర రావాలని అలాగే ప్రాసెసింగ్ యూనిట్లు, పల్ప్ పరిశ్రమకు వయబిలిటీ రావాల్సి ఉందని ముఖ్యమంత్రి అభిప్రాయం వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజనం పథకంలో భాగంగా విద్యార్థులకు మూడు రోజుల పాటు మ్యాంగో జ్యూస్ ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని పరిశ్రమల ప్రతినిధులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. అయితే విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో పోషకాహారంగా గుడ్డును అందిస్తున్నామని సీఎం తెలిపారు. ఈ అంశంపై అధ్యయనం చేసి తదుపరి ఆలోచన చేస్తామని స్పష్టం చేశారు.

**అంతర్జాతీయ ప్రమాణాలతో మామిడి పండించండి :** మామిడి పంటలో ఎరువులు పురుగుమందులు వాడకుండా అత్యుత్తమ విధానాలను అనుసరించాలని సీఎం చంద్రబాబు రైతులకు సూచించారు. ప్రస్తుతం రాష్ట్రంలో అంతా నేచురల్ ఫార్మింగ్ దిశగా అడుగులేస్తోందని.. మ్యాంగో రైతులు క్రమశిక్షణతో ఎరువులు , పురుగుమందుల వాడకం తగ్గించాలన్నారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా టెస్టింగ్ , ట్రేసింగ్, సర్టిఫికేషన్ వచ్చిందని .. మన ఉత్పత్తులు అమ్ముడు పోవాలంటే ప్రపంచ ప్రమాణాలు ఉండాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రాసెసింగ్ పరిశ్రమలు వారి సామర్థ్యానికి తగినట్టుగా రైతుల నుంచి మామిడి కొనుగోలు చేయాలని.. అప్పుడే రైతుకు న్యాయం జరుగుతుందని అన్నారు. ఎలాంటి వెయిటింగ్ లేకుండా మామిడి రైతులకు రూ.8 ధర చెల్లించి కొనుగోలు చేయాలని స్పష్టం చేశారు. కొందరు రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని వారి మాయలో పడొద్దని సీఎం రైతులకు హితవు పలికారు.

# టీడీపీకి కార్యకర్తలే బ్రాండ్ అంబాసిడర్‌లు

**- ప్రజలకు దగ్గరగా ఉన్న వారే నాకు దగ్గరగా ఉంటారు**

**- కుప్పం కార్యకర్తల సమావేశంలో టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు**





**కుప్పం - సూర్య వాస్తవం, జూలై 3:** ఇకపై ప్రభుత్వం చేపట్టే ప్రతి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్లో కార్యకర్తలు భాగస్వాములు కావాలని టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేటశారు. కుప్పం నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు - ఇంటింటి ప్రచారం కార్యక్రమ నిర్వహణపై చంద్రబాబు కేడర్ కు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. " పొలిటికల్ గవర్నెన్స్ చేపడుతున్నాం... అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో మీరు అంతా పాలుపంచుకోవాలి, నేను ప్రభుత్వ పనితో సమానంగా పార్టీ కోసం పని చేస్తున్నాను. పనులు చేయడం ఎంత ముఖ్యమో.. చేసిన పనిని చెప్పుకోవడం కూడా అంతే ముఖ్యం. నేను మొదటి సారి కుప్పానికి వచ్చినప్పటి కంటే ఇప్పుడు ఎంతో మార్పు వచ్చింది. సుపరిపాలనలో తొలి అడుగు.. ఇంటింటి ప్రచార కార్యక్రమం మొదలు పెట్టాం. ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో పాటు.. దాన్ని ప్రజలకూ తెలియ చెప్పాల్సిన బాధ్యతా ఉంది. గత పాలకులు అరాచకాలు చేసి 11 కు పడిపోయారు. బాబు ష్యూరిటీ.. భవిష్యత్ కు గ్యారెంటీ అని చెప్పాం. హామీలిచ్చిన విధంగా పని చేస్తున్నామని ప్రజలకు చెప్పాలి. కార్యకర్తలు ఇంటింటి వెళ్లి ప్రచారం చేసేటప్పుడు ఏమైనా లోటుపాట్లు ఉంటే సరిదిద్దండి. గత ప్రభుత్వం పెన్షన్లల్లో కోత పెట్టింది. మనం అర్హులందరికీ పెన్షన్లు ఇస్తున్నాం. అభివృద్ధికి బ్రాండ్ టీడీపీ అయితే.. టీడీపీకి బ్రాండ్ కార్యకర్తలే. నేతలు అటూ ఇటూ మారతారు కానీ కార్యకర్తలే శాశ్వతంగా ఉంటారు. డబుల్ సంక్షేమం చేస్తున్నాం. ఫలితం కూడా డబుల్ గానే ఉండాలనే లక్ష్యంతో కేడర్ పని చేయాలి. కుప్పంలో అన్ని ఎలక్ట్రిక్ బస్సులే, అవి కూడా ఏసీ బస్సులే ఉండేలా చేస్తాం. కుప్పంలో 100 శాతం సోలార్ రూఫ్ టాప్ చేయించాలి. కుప్పానికి ఎయిర్ పోర్టు రాబోతోంది. అభివృద్ధిని అడ్డుకోవద్దు. కుప్పం అభివృద్ధికి ప్రజల సహకారం కూడా కావాలి. మల్లప్ప కొండ, నన్యాల్ వంటి వాటిని టూరిజం స్పాట్లుగా అభివృద్ధి చేస్తున్నాం. హంద్రీ-నీవా నీళ్లు వస్తున్నాయి. భవిష్యత్తులో కుప్పంలో కరవు అనేదే లేకుండా చేస్తాం. ప్రజలకు మంచి జరిగితే టీడీపీ కార్యకర్తే గుర్తుకు రావాలి." అని చంద్రబాబు చెప్పారు.

**టీడీపీ కార్యకర్తకి మంచి పేరు శాశ్వతం కావాలి :** ప్రజలకు దగ్గరైన వారు నాకు దగ్గరగా ఉంటారు. ప్రజల్లో చెడ్డ పేరుంటే నమస్కారం పెట్టి పక్కన పెట్టేస్తాను. కుప్పంలోనే కాదు.. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే ఫార్మూలా. టీడీపీ కుటుంబ సభ్యులకు సమాజంలో శాశ్వతంగా మంచి పేరు ఉండాలి. పార్టీ కోసం పని చేసిన వారికి.. గత ప్రభుత్వంలో ఇబ్బందులు పడ్డ వారికి ప్రయార్టీ ఇవ్వాలి. టీడీపీది పెద్ద సైన్యం. ఎవరి పరిధిలో వారు చేస్తే అద్భుతాలు సాధించగలం. రాబోయే నెల రోజుల్లో 100 శాతం ఇంటింటికి ప్రచారం చేయాలి. పబ్లిక్ పాజిటివ్ పర్సెప్షన్ 5 - 6 శాతం పెరగాలి. లీడర్ షిప్ ట్రైనింగ్ కార్యక్రమాలు చేపడతాం." అని టీడీపీ అధినేత వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్ మునిరత్నం, మాజీ ఎమ్మెల్సీ గౌని వారి శ్రీనివాసులు, నేతలు డాక్టర్ సురేష్ బాబు,తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ షాక్‌తో వ్యక్తి దుర్మరణం

**- మునీశ్వర్ కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే డా.నెలవల విజయశ్రీ**





**నాయుడుపేట - సూర్య వాస్తవం, జూలై 3:** నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలోని మహాలక్ష్మి నగర్ లో గురువారం జరుగునున్న తెలుగుదేశం పార్టీ సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి షామియానా సిద్ధం చేస్తూ విద్యుత్ షాక్ తగలడంతో కందుకూరి మునీశ్వర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి ఇద్దరు ఆడపిల్లలు, భార్య ఉన్నారు. మహాలక్ష్మి నగర్‌లో విద్యుత్తు లైను ప్రమాద భరితంగా ఉన్నాయని స్థానికులు అంటున్నారు. ప్రమాద భరితంగా ఉన్న విద్యుత్తు లైన్ లను మార్చాలని విద్యుత్ శాఖ అధికారులకు గ్రామస్తులు అనేకసార్లు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదపరితంగా ఉన్న విద్యుత్ లైన్‌ల కారణంగా ఓ వ్యక్తి అన్యాయంగా మృతి చెందాడని గ్రామస్తులు అంటున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మహాలక్ష్మి నగర్‌లో గురువారం తెలుగుదేశం పార్టీ సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి షామియానా ఏర్పాటు చేస్తూ విద్యుత్ షాక్ తో మృతి చెందిన కందుకూరి మునీశ్వర్ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ స్థానిక నాయకులతో కలిసి పరామర్శించారు. విద్యుత్ షాక్ తో కందుకూరి మునీశ్వర్ మృతి చెందిన సమాచారాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ స్థానిక ప్రభుత్వాసుపత్రికి చేరుకుని మునీశ్వర్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, మున్సిపల్ వైస్ చైర్మన్, నాయుడుపేట పట్టణ టిడిపి అధ్యక్షులు షేక్ రఫీ, శ్రీ పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్ నానబాల సుబ్బారావు, పలువురు నాయకులు ఉన్నారు.

# హిందూపురం జామియా కమిటీ రద్దు



**హిందూపురం - సూర్య వాస్తవం, జూలై 3:** పురం జామియా కమిటీ రద్దు చేస్తున్నట్టు ఒక్ బోర్డ్ అధికారులు తెలిపారు. వక్ఫ్ బోర్డు అధికారులు రహీం, ఇస్మాయిల్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా వక్ఫ్ బోర్డు అధికారులు హిందూపురం పట్టణాన్ని సందర్శించి జామియా మసీదు ఆస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ప్రస్తుతం ఉన్న జామియా కమిటీను పదవీకాలం ముగిసినందున ఐదు మంది మత పెద్దలను ఇన్చార్జులుగా నియమించామన్నారు. ఆస్తుల వివరాలు అందుకు సంబంధించిన ఆర్థిక లావాదేవీల గురించి ప్రస్తుతం ఉన్న కమిటీ పూర్తి సమాచారం ఇవ్వాలన్నారు. నూతనంగా లోకల్ బాడీ ఎలక్షన్లు వర్క్ బోర్డ్ యాక్ట్ 2009 జీవో నెంబర్ 74 ఆధారంగా ఎన్నికలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు అధికారులు ముత్తు వల్లి, కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.

# వైద్య వృత్తికి కళంకం తేవొద్దు

- ప్రభుత్వాస్పత్రులకు వచ్చేది పేదలే
- వారికి అందుబాటులో ఉండి మెరుగైన సేవలందించండి
- లేకపోతే మిమ్మల్ని దేవుడు కూడా క్షమించడు
- వైద్య, ఆరోగ్య శాఖ సమీక్షలో జీజీహెచ్ సూపరింటెండెంట్, ఇతర అధికారులు, డీ.ఎం.హెచ్.ఓ తీరుపై కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆగ్రహం



**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, జూలై 3:** దేవుడి తరువాత దైవంగా భావించేది వైద్యులనే. అంతటి పవిత్రమైన వృతి నుంచే నేనూ వచ్చా. అయితే ఇక్కడ చూస్తుంటే అందుకు భిన్నమైన వాతావరణం నెలకొంది. పదేపదే చెబుతున్నా మీ తీరు మారడం లేదు. వృత్తిలో కొనసాగాలంటే పేదల పట్ల కాస్త జాలి చూపండి. వారికి అందుబాటులో ఉండి నిస్వార్థంగా సేవలు అందించండి. మీకేమైనా సమస్యలు ఉంటే నా దృష్టికి తీసుకురండి. మీరైతే మారాలి. లేదంటే వేటు తప్పదు. వైద్య వృత్తికి కళంకం తెస్తే సహించేది లేదంటూ అనంతపురం కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ తీవ్ర స్థాయిలో హెచ్చరించారు. స్థానిక కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో గురువారం వైద్య ఆరోగ్య శాఖపై సమీక్షించారు. ప్రభుత్వ సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ ఆత్మారం, డీ. ఎం. హెచ్. ఓ డాక్టర్ ఈబీ దేవి తీరుపై కలెక్టర్ మండిపడ్డారు. ముఖ్యంగా ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగుల సేవలకు తగ్గట్టు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని, విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తేల్చిచెప్పారు. ఇకపై ప్రతి నెల మొదటి గురువారం రోజున సమీక్ష సమావేశం నిర్వహించడంజరుగుతుందని తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన వైద్య సేవలు అందించే క్రమంలో ఏవైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తెలియజేస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రధాన కేంద్రానికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వైద్య సేవలు అందించాలని కలెక్టర్ సూచించారు. ఆసుపత్రులలో వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది అందుబాటులో విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా వైద్య ఆరోగ్య శాఖలో పనిచేసే ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలన్నారు. ప్రస్తుత సమయంలో సీజనల్ వ్యాధులు అయిన కీటక జనిత వ్యాధులపై ప్రజలను గ్రామస్థాయి నుండి అప్రమత్తం చేసే విధంగా అవగాహన కార్యక్రమం చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. వైద్య సేవలు అందించడంలో ప్రభుత్వానికి చెడ్డపేరుతెచ్చేలాఉండకూడదని సూచించారు. రానున్న రోజుల్లో తానే స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి ఆసుపత్రుల పనితీరును పరిశీలిస్తానని కలెక్టర్ తెలిపారు. రోగులకు వైద్య సేవలు అందించే క్రమంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే అందుకు బాధ్యులపై శాఖా పరమైన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. జిల్లాలో వివిధ ప్రాంతాలలో జరుగుతున్న ఆసుపత్రుల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సూచించారు. జిల్లా కేంద్రంలో ప్రధాన ఆసుపత్రిలో కూడా అవసరమైన మేరకు సదుపాయాలు వసతులు తదితర అంశాలపై దృష్టిని సారించాలన్నారు. వైద్య వృత్తిని ఒక గొప్ప వృత్తిగా భావించిమానవతాదృక్పథంతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించుటకు కృషి చేయాలన్నారు. అలాగే ప్రభుత్వ పథకాలను అర్హులందరూ లబ్ధి పొందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. వైద్యులు తమ వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకుంటూ వైద్య చికిత్సలు అందించాలని నిర్లక్ష్యం అజాగ్రత్త లేదా నిర్లక్ష్య వైఖరి కారణంగా రోగులకు ఎలాంటి హాని కలిగించవద్దని కలెక్టర్ సూచించారు. ఇటీవల తాను క్షేత్రస్థాయిలో ప్రభుత్వ ఆసుపత్రులను తనిఖీ చేసినప్పుడు అక్కడ ఉన్న వైద్యసేవలు, పరిసరాల వాతావరణం సరిగా లేదని పేర్కొంటూ ఒక దశలో కలెక్టర్ అసంతృప్తిని వ్యక్తం చేశారు. సి.హెచ్. సి మరియు ఏరియా ఆసుపత్రులలో కూడా వైద్య సేవలను అన్ని విధాల పటిష్టం చేయవలసిన అవసరం ఉందన్నారు. క్షేత్రస్థాయిలో వైద్య అధికారులు పర్యటిస్తూ క్రింది స్థాయి ఉద్యోగ, సిబ్బందితో సమన్వయం చేసుకొని ప్రజలకు వైద్య సేవలు అందించాలన్నారు. జిల్లా కేంద్రంలో ప్రధాన ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవల కొరకు ఇతర అభివృద్ధికి సంబంధించి ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకొని అమలు చేయాలన్నారు.అనంతరం వివిధ ప్రాంతాలలో ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతి, బడ్జెట్ మంజూరు, పెండింగ్ పనులకు కారణాలు తదితర అంశాలపై కలెక్టర్ ఆరా తీశారు. రాయదుర్గం ,తాడిపత్రి ఏరియా హాస్పిటల్ ను అక్టోబర్ మాసంలోగా అలాగే కొన కొండ్ల ఆగస్టు మాసం ఆఖరిలోగా పూర్తి చేయాలని ఏపీ ఎం ఎస్ ఐ డి సి అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. రానున్న సమావేశానికి ప్రగతి నివేదికలతో హాజరుకావాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.ఈ .బి .దేవి, డిసిహెచ్ఎస్ ఇన్చార్జ్ డా.డేవిడ్ , ఏపీ ఎంఎస్ఐడిసి ఈ ఈ శ్రీనివాస నాయుడు, మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డా.షారోన్ సోనియా, వైస్ ప్రిన్సిపల్ డా.శంకర్ నాయక్, జి జి హెచ్ సూపరింటెండెంట్ డా. ఆత్మారాం ప్రోగ్రాం ఆఫీసర్లు, డా.నారాయణ స్వామి, డా. శ్రీనివాసరెడ్డి, డా. విష్ణుమూర్తి, మలేరియా శాఖ అధికారి డా. ఓబులు పాల్గొన్నారు.



## డీకే శివకుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే సుబ్బారెడ్డి



**బెంగళూరు - సూర్య వాస్తవం, జూలై 3:** ఎమ్మెల్యే ఎస్.ఎన్. సుబ్బారెడ్డి గురువారం నాడు హోం కార్యాలయంలో డీకే శివకుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. బాగేపల్లి పేరును భాగ్యనగర్‌గా మార్చాలని మంత్రివర్గం తీసుకున్న నిర్ణయానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఇది ఈ ప్రాంత ప్రజల దీర్ఘకాల డిమాండ్ అని సుబ్బారెడ్డి కూడా దీనిని చాలాసార్లు మా దృష్టికి తీసుకువచ్చారనీ డీకే శివకుమార్ పేర్కొన్నారు. ఆయన డిమాండ్ మరియు అక్కడి ప్రజల డిమాండ్ నెరవేరాయని భాగ్యనగర్ దాని పేరు లా శుభప్రదంగా ఉండాలని తెలియజేశారు

## భర్తను హత్య చేసిన భార్య

### - ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన



**మదనపల్లె సూర్య వాస్తవం:** అన్నమయ్య జిల్లాలోని మదనపల్లె మండలంలో భర్తను భార్య చంపేసిన సంఘటన గురువారం రాత్రి వెలుగు చూసింది. తాలూకా పోలీసుల కథనం మేరకు.. కొత్తవారిపల్లె పంచాయతీ, రెడ్డిగానిపల్లికు చెందిన వీరభద్ర కొడుకు చంద్రశేఖర్ (42) తన రెండో భార్య రమాదేవి భర్తతో గొడవపడి రాత్రి గొంతు నులిమి, ఇనుపరాడ్డుతో హతమార్చింది. ఆలస్యంగా హత్య ఉదంతం వెలుగులోకి రావడంతో, సీఐ వెళ్లి మృతదేహం పరిశీలించి పోస్టు మార్టం కోసం అస్పత్రికి తరలించారు. భార్య పరారీలో ఉండడంతో భర్తను భార్య హత్య చేసిందని పోలీసులు, గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

# నిఘా నీడలో ఎమ్మెల్యేలు



**విజయవాడ - సూర్య వాస్తవం** తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు కొందరు ఎమ్మెల్యేలపై ఆగ్రహంతో ఉన్నారు. నాన్ సీరియస్ కేటగిరీలోని ఎమ్మెల్యే జాబితా రెడీ అవుతుంది. ప్రజాసమస్యలు పట్టించు కోకుండా ఎమ్మెల్యేగా బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించకుండా సొంత పనులపైనే దృష్టి పెడుతున్న ఎమ్మెల్యేల జాబితాను సిద్ధం చేస్తున్నట్లుసమాచారం. వారు నియోజకవర్గానికి దూరంగా వ్యాపారాలు ప్రధానంగా వ్యాపకం చేసుకుంటూ కాలం వెళ్ల దీస్తున్న ఎమ్మెల్యేలకు సీరియస్ వార్నింగ్ ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారని సమాచారం. ఇప్పటికే పార్టీ రాష్ట్ర స్థాయి విస్తృత స్థాయి సమావేశంలో గైర్హాజరయిన ఎమ్మెల్యేలపై ఆగ్రహం వ్యక్తం చేసిన చంద్రబాబు నాయుడు యాభై మంది సమావేశానికి రాకపోవడానికి గల కారణాలను తెలుసుకుని వారిని వ్యక్తిగతంగా పిలిచి క్లాస్ పీకాలని నిర్ణయించారు. . కొందరు సమావేశానికి వచ్చి సంతకాలు చేసి వెళ్లడం కూడా చంద్రబాబు సీరియస్ అయ్యారు. పార్టీ అధినేతగా, ముఖ్యమంత్రిగా తాను సమావేశంలో ఎక్కువ సేపు సమావేశంలో గడిపితే కనీసం కూర్చునే ఓపిక లేని ఎమ్మెల్యేలను ఉపేక్షించడం అనవసరమని భావిస్తున్నారు. ఆధ్యాత్మక పర్యటనలకు, విదేశీ పర్యటనలకు వెళ్లడం మంచిదేనని, అయితే సమయం సందర్భం ఉండాలి కదా అని చంద్రబాబు నేతలను నిలదీసే అవకాశాలు కనిపిస్తున్నాయి. నేటి నుంచి తొలి అడుగు ఇంటింటికి కార్యక్రమం ప్రారంభం కానుండటం, నెల రోజుల పాటు ఈ కార్యక్రమం జరగుతుండటంతో ఇది పూర్తయిన తర్వాత వ్యక్తిగతంగా ఎమ్మెల్యేలను ఒక్కొక్కరిని పిలిచి క్లాస్ పీకే అవకాశాలు కనిపిస్తున్నాయి. . నాటా, అటా సభలకు ముందు గానే అమెరికా ప్రయాణం పెట్టుకున్న వారి విషయంలోనూ చంద్రబాబు ఒక నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని తెలిసింది. అయితే దీంతో పాటు ఇంటింటికి తొలి అడుగు కార్యక్రమంలో ఎలా పాల్గొన్నారన్న దానిపై కూడా నివేదికలు తెప్పించుకునే అవకాశముంది.

ఎమ్మెల్యేలు స్వయంగా ఇంటికి వెళుతున్నారా? లేక తమ అనుచరులును పంపుతున్నారా? అన్న దానిపై కూడా నివేదికలు ఎప్పటికప్పుడు కేంద్ర పార్టీ నుంచి నివేదికలు తెప్పించుకునే అవకాశాలున్నాయి. చంద్రబాబు పార్టీ పరమైన కార్య క్రమా లను నిర్లక్ష్యం చేస్తే సహించకూడదని నిర్ణయించు కున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ప్రజలకు అందుబాటులో ఉండని వారిని వదులుకునేందుకు కూడా సిద్ధమని చెబుతు న్నారు. ఇప్పటికి ఏడాదే అయింది కాబట్టి.. హెచ్చరికలు జారీ చేస్తున్నారని.. సీరియస్ గా తీసుకోని వారి విషయంలో.. తర్వాత ఎంత ఒత్తిడి చేసినా ప్రయోజనం ఉండదని అంటున్నారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )